సంపుటి : 18
సంచిక : 125
Vol : 18
Issue : 125

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శనివారం 11 జూలై 2026
Warangal, Saturday 11 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# మళ్లీ మాదే అధికారం

- 117 స్థానాలు గెలిచి తీరుతాం...
- 182కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు
- కేసీఆర్‌ను మళ్లీ మొలకెత్తనివ్వం...
- కల్వకుంట్ల కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు
- జగన్నాథపురం రైతుభరోసా సభలో రేవంత్‌రెడ్డి





**పీపుల్స్‌డైరీ-ఖమ్మం :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 26కి, అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కి పెరుగుతాయని సీఎం ప్రకటించారు. 36 నెలల ముందుగానే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నట్లు వ్యాఖ్యానించిన ఆయన, "182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండో సారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు

రాజకీయంగా పాలమూరు తనకు ప్రాణమైతే.. ఖమ్మం జిల్లా గుండెకాయ లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరకు ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 2023 జూలైలో పొంగులేటి చేరిక సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలు ఉప్పెనలా వచ్చి బీఆర్ఎస్ కు బొంద పెట్టారని రేవంత్ ఎద్దేవా చేశారు. సరిగ్గా ఇప్పుడు అదే జూలై లో బీఆర్ఎస్ ను మళ్లీ మొలకెత్తనివ్వమని చింతకాని సభకు వేలాదిగా తరలి వచ్చిన మీకు అభినందనలు అంటూ తన ప్రసగించారు.

2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించి... పాపాల భైరవున్ని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారు. జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు. వచ్చే

(మిగతా 2వ పేజీలో...)

# కడలిలో సింహం


- సంద్రంలో సరికొత్త అస్త్రం
- భారత నావికాదళంలో మరో కీర్తి పతాక..
- శత్రువుల గుండెల్లో నిద్రపోయే ఆయుధం
- సేవలు ప్రారంభించిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి
- శత్రు రాడార్లకు చిక్కకుండా దూసుకుపోయే టెక్నాలజీ



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : భారతదేశ రక్షణ రంగం మరింత బలోపేతం చేసే దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది. మూడు వైపులా సముద్రం ఉన్న భారతదేశానికి నౌకాదళం అత్యంత కీలకం. అందుకే అత్యాధునిక యుద్ధనౌకలను నావికాదళం సమకూర్చుకుంటుంది. సముద్ర జలాల్లో శత్రుదేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా సరికొత్త యుద్ధనౌకలను రంగంలోకి దింపుతోంది. ఇందులో భాగంగానే అత్యాధునిక సాంకేతికత, స్వదేశీ నైపుణ్యంతో రూపుదిద్దుకున్న సస్టెల్త్ ఫి గ్రేట్ మహేంద్రగిరి ఇప్పుడు సేవలందించేందుకు సిద్ధమైంది. శివాలిక్ క్లాస్ ఫ్రిగ్రేట్లకు కొనసాగింపుగా ప్రాజెక్టు 17 ఏ ని రక్షణ శాఖ చేపట్టింది. ఈ సిరీస్లో ఏడు అత్యాధునిక స్టెల్త్ ఫి గ్రేట్ లను సిద్ధం చేయాలనేది లక్ష్యం. ఈ ప్రత్యేక శ్రేణిలో ఆరవ యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరి పర్వత క్రీడల పేరును సార్ధకం చేస్తూ ఈ యుద్ధనౌకకు మహేంద్రగిరిగా నామకరణం చేశారు. ముంబైలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించింది. మేరీ వర్షిప్

(మిగతా 2లో...)

# చచ్చిపోతున్న ఆశలు!



- దోబూచులాడుతున్న వరుణుడు
- తెలంగాణ అన్నదాతలో తీవ్ర ఆందోళన
- కరువు పరిస్థితులు తప్పవా...?
- ఆకాశం వైపు రైతన్నల చూపులు
- ఎల్ నినో ఎంతపని చేసింది

చిట్యాల, జూలై 10 (పీపుల్స్ డైరీ) : వర్షాకాలంలో అత్యంత కీలకమైన నెలలైన జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఆశించిన మేరకు వర్షాలు కురిస్తేనే అటు రైతన్నలకు, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉంటాయి. ముఖ్యంగా జూన్‌ల ప్రారంభం నుంచే సకాలంలో వర్షాలు కురిస్తేనే ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయి. ఎండాకాలం, వర్షాకాలం, చలికాలాలు ఆయా నెల్లో సాధారణంగా ఉంటేనే మానవ మనుగడ సజావుగా సాగుతుంది. ఈ ప్రకృతి నియమాలు మానవ తప్పిదాల వల్లగానీ, ఇతర కారణాల వల్లగానీ దారితప్పితే తీరని నష్టం వాటిల్లుతుంది. ప్రతి సంవత్సరంలో ఈ 12 నెలల వాతావరణ మార్పుల అనుకూలతలే మానవ జీవనం.

ఈసారి నైరుతి రుతుపవనాల ప్రభావం లేకపోవడంతో వర్షాలు కురవడం లేదు. నైరుతి నీ జాడేది...? మేఘాలు కురిపించి మాకు వర్షాన్ని అందించాలని రైతులు ప్రజలు కోరుతున్నారు. ముందస్తుగానే నైరుతి తీరాలు దాటింది అని ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నదాతలు ఆనందంలో ఉన్నారు. కానీ వారి ఆశలు నిరాశలు అయ్యాయి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే బావులు చెరువులు నదులు రిజర్వాయర్లు ప్రాజెక్టులు జలకలతో ఉండేవి. దేశానికి అన్నం పెట్టే అన్నదాత దేశానికి వెన్నెముక. ఆ వెన్నెముక విరిగే పరిస్థితులు ఎల్ నినో ప్రభావంతో వచ్చాయి. ఒక్క రైతు పంట పండిస్తే సాధారణ కూలీ మొదలుకొని సాఫ్ట్ వేరు ఉద్యోగి వరకు జీవనాన్ని కొనసాగిస్తారు.


వ్యవసాయం సరిగ్గా సాగితేనే దానిపై ఆధారపడే ఎన్నో వ్యాపారాలు సజావుగా సాగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ సైతం స్థిరంగా ఉంటుందనేది మనందరికీ తెలిసిందే. (మిగతా 2లో)



## డెస్క్ జాబ్‌లు చేసే వారికి

# క్యాన్సర్ రిస్క్

- కూర్చొని పని చేసే వారికి హెచ్చరిక..
- వర్కౌట్లు చేసినా క్యాన్సర్ వచ్చే ప్రమాదం
- ఎక్కువ సమయం కూర్చోవడం వల్లే సమస్య
- ఓ అధ్యయనంలో వెల్లడైన కీలక అంశాలు
- గంటకోసారి బ్రేక్ తీసుకొని నడవాలంటున్న నిపుణులు



పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : మీరు రోజూ ఉదయాన్నే జిమ్‌కు వెళ్లడం లేదా వాకింగ్ చేయడం లేదా యోగా చేయడం లాంటివి చేస్తున్నారా? ఆ తర్వాత 8 నుంచి 10 గంటలపాటు కుర్చీకి అతుక్కొని పని చేస్తున్నారా? అయితే మీరు ఉదయాన్నే చేసే వర్కౌట్ ఏమాత్రం సరిపోదని ఓ అధ్యయనం చెబుతోంది.

గంటల తరబడి కూర్చొని పని చేయడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం మరియు మరణించే ముప్పు ఎక్కువగా ఉందని 'పీఎల్ఓఎస్ మెడిసిన్' జర్నల్‌లో పబ్లిష్ అయిన ఓ అధ్యయనం వెల్లడించింది. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వారికి సైతం ఈ ముప్పు ఉందని అధ్యయనం వెల్లడించడం గమనార్హం.

రోజూ గంటల తరబడి కూర్చొని పని చేసే కోట్లాది మంది భారతీయులు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు ఈ పరిశోధన ఫలితాలు

(మిగతా 2లో...)

# హరీష్‌రావుకు టీపీసీసీ చీఫ్ బిగ్ ఆఫర్..

- కాంగ్రెస్‌లోకి రండి... మీరన్నది చేస్తాం...
- పదేళ్లలో ఏమీ చేయని మీరు మూడు నెలల్లో ఏం చేస్తారు?
- గత ప్రభుత్వ తప్పులను సరిచేస్తున్నాం
- టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం కొనసాగుతోంది. కాళేశ్వరం చుట్టూ రాజకీయం తిరుగుతోంది. రేవంత్ చేసిన సవాల్‌కు హరీస్ స్పందిస్తూ.. తనకు ఇరిగేషన్ శాఖ అప్పగిస్తే సక్సెస్ చేస్తానని వెల్లడించారు. దీని పైన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందించారు. హరీష్‌కు ఆఫర్ ఇచ్చారు. హరీష్ కాంగ్రెస్ లోకి వస్తానంటే.. నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

కాళేశ్వరం కేంద్రంగా సవాళ్లు కొనసాగుతుండగా సీఎం రేవంత్ కాళేశ్వరం విషయంలో కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.. కేసీఆర్ అసెంబ్లీ (మిగతా 2లో...)

# 'సర్' పేరుతో ఓటీపీ అడుగుతున్నారా..

## అయితే మోసపోతారు జాగ్రత్త



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2026 ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్, జిల్లా ఎన్నికల అధికారులు హెచ్చరించారు. ఓటరు వివరాల ధృవీకరణ పేరుతో మోసగాళ్లు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు అడిగే అవకాశం ఉందని, అలాంటి కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పేరు సరిచేయడం, వివరాలు అప్‌డేట్ చేయడం, ధృవీకరణ చేయడం వంటి కారణాలు చెబుతూ ఓటీపీ అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు. ఎన్నికల అధికారులు ఎప్పటికీ ఫోన్ ద్వారా ఓటీపీలు, బ్యాంకు వివరాలు లేదా ఇతర రహస్య సమాచారాన్ని అడగరని తెలిపారు.

"మీ ఓటు ఎంత విలువైనదో.. మీ వ్యక్తిగత సమాచారం కూడా అంతే విలువైనది. సర్ పేరుతో మోసగాళ్లకు అవకాశం ఇవ్వొద్దు. ఒకసారి ఓటీపీ పంచుకుంటే మీ డబ్బుతో పాటు వ్యక్తిగత సమాచారం కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది" అని సీవీ సజ్జనార్ పేర్కొన్నారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే (మిగతా 2వ పేజీలో...)

# హైదరాబాద్ బోనాల జాతరకు ముహూర్తం ఖరారు

- జూలై 16 బోనాల జాతర మొదలు
- బోనాల జాతర బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఆషాడ బోనాల ఉత్సవాల సందడి నెలకొంది. జులై 16వ తేదీ నుంచి హైదరాబాద్‌లో బోనాల పండుగ మొదలు కానుంది. గోల్కొండలోని జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ఆషాడ బోనాలు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో గోల్కొండ కోటలో జగదాంబికా మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ .. వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి సురేఖ.. ఏటా నిర్వహించే హైదరాబాద్ ఆషాడ బోనాల ఉత్సవాలు.. గంగా జమున తెహజీబ్ ప్రత్యేకతను చాటుతాయని అన్నారు. (మిగతా 2లో...)



# మళ్లీ మాదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు. 2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26కు పెరుగుతాయి. 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి. 36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా.. 182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సీఎం ఉద్ఘాటించారు.

భద్రాచలం రాములవారి మీద ఆన... ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట అంటూ తన స్వరాన్నిపెంచిన సీఎం రేవంత్.. " రాస్కో చంద్ర శేఖర్ రావు... నీ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు గుర్తు పెట్టుకోండి. ఈ మాట కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తాం అంటూ సవాల్ విసిరారు. ప్రతీ సందర్భంలో ప్రజా ప్రభుత్వం రైతులను ఆదుకుంటోందని పేర్కొన్న సీఎం. కేసీఆర్ కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదని.. ఒకే ఇంట్లో రెండు గుంపులున్నాయని విమర్శించారు. ఒకరిపై ఒకరు పోటీగా ఒకాయన కన్నెపల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడని మండిపడ్డారు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఇంత నష్టం జరిగిందన్ని సీఎం.. మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడని చెప్పుకొచ్చారు.

ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోయాయి దుర్మార్గుడా... నీ దుష్ట రాజకీయాల కోసం మేడిగడ్డ నింపాలా అని అడిగితే సమాధానం లేదు. రేవంత్ రెడ్డి సర్వేలో కాంగ్రెస్ ఓడిపోతుందని దుష్ప్రచారానికి దిగారు. ఎన్నికలు ఎప్పుడో తెలియకుండా, రిజర్వేషన్లు ఎలా మారుతాయో తెలియకుండా ఎవరైనా సర్వేలు చేస్తారా.. గెలుపు ఓటములు నిర్ణయిస్తారా? జూబ్లీహిల్స్ లో ఇలాగే చెబితే జనం బీఆర్ఎస్ ను బండకేసి



కొట్టారు. బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైంది అంటూ రేవంత్ ఫైర్ అయ్యారు.

# చచ్చిపోతున్న ఆశలు!

(మొదటి పేజీ తరువాయి)




కానీ ఈసారి ఎల్ నినో ప్రభావంతో ప్రకృతికి విరుద్ధంగా వాతావరణం మారిపోతుంది. వానలు లేకపోవడంతో కరువు ఛాయలు వస్తాయా.. ఆకలి కేకలు ఆర్తనాదాలు మొదలవుతాయా.. అనే భయం కూడా సమాజంలో మొదలయ్యాయి. ఈ క్రమంలో సరియైన సమయానికి వర్షాలు కురవక రైతుల పరిస్థితి దారుణంగా మారింది.

భారతదేశంలో వర్షం పై ఆధారపడి పంటలు పండించే రైతులు దాదాపు 60 శాతం మేర ఉన్నారు. కానీ ఈసారి ఎండాకాలంలో వీచిన వడగాలులకు తీవ్రమైన ఎండల ప్రభావానికి వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుని ఈ వర్షాకాలం నాటికి కూడా ఆ ప్రభావం పోవడం లేదు. దీంతో వాతావరణంలో మేఘాలు వర్షం కురిసే ప్రభావంతో ఉన్నా కూడా వర్షాలు కురవడం లేదు. వానాకాలం మొదలైన కూడా ఎండలు పోవడం లేదు. వర్షాల కోసం వాన దేవుడికి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవాలని వివిధ రూపాల్లో పూజలు అభిషేకాలు చేసినా కూడా వానలు కురవడం లేదని రైతులు ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

# డెస్క్ జాబ్‌లు చేసే వారికి క్యాన్సర్ రిస్క్

(మొదటి పేజీ తరువాయి)



ఎంతో కీలకమని చెప్పొచ్చు. ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 91 వేల మందిని 12 ఏళ్లపాటు పర్యవేక్షించారు. రోజూ నిరంతరాయంగా 30 నిమిషాల కంటే ఎక్కువ సేపు కూర్చొనే వారిలో క్యాన్సర్‌తో మరణించే ముప్పు ఎక్కువగా ఉందని ఈ అధ్యయనంలో తేలింది. అలా కూర్చొనే సమయం అదనంగా ఓ గంట పెరిగే కొద్దీ క్యాన్సర్ రిస్క్ 10 శాతం పెరుగుతోందని పరిశోధకులు తెలిపారు. కూర్చొనే సమయానికి బదులు శారీరక శ్రమ చేస్తే క్యాన్సర్ రిస్క్ తగ్గుతోంది. ఒక గంటసేపు శారీరక శ్రమ చేస్తే క్యాన్సర్ ముప్పు 12 శాతం తగ్గుతుండగా.. అరగంటపాటు ఓ మాదిరి వ్యాయామం చేస్తే 8 శాతం, ఐదు నిమిషాలు కఠిన శారీరక శ్రమ చేస్తే 22 శాతం చొప్పున క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్లు గుర్తించారు. "డెస్ జాబ్స్ చేసే వారికి తరచుగా చిన్నపాటి విరామాలు తీసుకోవడం ముఖ్యం. ప్రతి 30–60 నిమిషాలకు ఒకసారి లేచి ఐదు నిమిషాలు నడవాలి. అవకాశం ఉంటే నిలబడి పని చేయాలి. ఫోన్లో మాట్లాడేటప్పుడు నడవటం లాంటివి చేయాలి. వర్క్ ఫ్రమ్ హోం చేసేవారు కదలడం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాలక్రమంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. తరచుగా చిన్నపాటి విరామాలు తీసుకొని అటు ఇటు తిరగడం అనేది రోజువారీ జీవితంలో ఎంతో ముఖ్యమైంది" అని తెలిపారు.

# కడలిలో సింహం

(మొదటి పేజీ తరువాయి)

డిజైన్ బ్యూరో ఈ నౌకకు రూపకల్పన చేసింది.

బ్రహ్మోస్, క్రూజ్ క్షిపణులు, 76 ఎంఎం నేవల్ గన్, ట్రిపుల్ టోర్పిడో వరుణాస్త్రలు, రాకెట్ లాంఛర్లు, రెండు ధ్రువ్, సీకింగ్ హెలికాప్టర్లు వంటి ఆయుధ సంపత్తి కలిగి ఉంటుంది ఈ ఐఎన్ఎస్ మహేంద్రగిరి. వేగం గంటకు 28 నాట్స్.. శత్రువుల నౌకలు, జలాంతర్గాముల కదలికలను పసిగట్టడానికి అనువుగా ఉంటుంది. అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌక శత్రువు రాడారులకు చిక్కకుండా తన పని పూర్తి చేస్తుంది. పూర్తి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రాడార్, సోనార్ వ్యవస్థలు అదనపు బలం. నౌక పొడవు 149 మీటర్లు, వెడల్పు 17.8 మీటర్లు, బరువు 6,670 టన్నులు. అత్యాధునిక స్టెల్త్ సాంకేతికత, తక్కువ రాడార్ గుర్తింపు, అధిక స్థాయి ఆటోమేషన్, మెరుగైన రక్షణ వ్యవస్థలతో ఈ నౌకను నిర్మించారు. ఈ యుద్ధ నౌక కంబైన్డ్ డీజిల్ ఆర్ గ్యాస్ ప్రొపల్షన్ వ్యవస్థతో పనిచేస్తుంది. దీని ద్వారా అధిక వేగంతో పాటు దీర్ఘకాల సముద్ర కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం లభిస్తుంది.



# హైదరాబాద్ బోనాల జాతరకు ముహూర్తం ఖరారు


(మొదటి పేజీ తరువాయి)

జంట నగరాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణ, ముస్లిం పండుగల సందర్భాల్లో హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం, ప్రజలు ప్రదర్శించే లౌకిక స్ఫూర్తి యావత్ దేశానికి గొప్ప సందేశం ఇస్తుందన్నారు. జూలై 16 నుంచి ఆషాడ బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని.. తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు మంత్రి. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు.

బోనాల జాతరలో భాగంగా జూలై 16వ తేదన లంగర్ హౌస్ కూడలి నుంచి అమ్మవారి బోనం సమర్పణ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో బోనం సమర్పణ, తొట్టెలు రథం ఊరేగింపు, మెట్ల పూజకు అవసరమైన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని కొండా సురేఖ అధికారులకు సూచించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి జూలై 16, 19, 23, 26, 30 తేదీలతో పాటుగా.. ఆగస్ట్ 2,6,9,13 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. వాహనాల పార్కింగ్, బారికేడ్లు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, కరెంట్, వైద్య సేవలు, ప్రత్యేక బస్సులు, పారిశుద్ధ్యం ఇలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

# కోతుల కోరల్లో... గణపురం!

- చిన్నారులు, మహిళలు, వృద్ధులే లక్ష్యంగా వరుస దాడులు
- ఇళ్లపై, పాఠశాలల వద్ద, వీధుల్లో స్వైరవిహారం
- ఫిర్యాదుల పరంపర... అధికారుల స్పందన మాత్రం శూన్యం
- కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?
- పగలు, రాత్రి... కోతుల కాపలా!
- గుమ్మం దాటాలంటే గుండెల్లో గుబులు!
- కోతులే పాలకులు... అధికారులు ప్రేక్షకులు...
- ఇంకెన్నాళ్లు ఈ వానర భయం...?
- వెంటనే కోతులను పట్టుకోవాలి...




పీపుల్స్‌డైరీ–గణపురం : మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అడవుల్లో ఉండాల్సిన కోతులు గుంపులుగా గ్రామంలోకి చొరబడి వీధులు, కాలనీలు, ఇళ్ల పైకప్పులు, దేవాలయాలు, పాఠశాలల పరిసరాల్లో స్వైరవిహారం చేస్తూ ఎదురుపడిన వారిపై దాడులకు తెగబడుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ముగ్గురిపై వరుసగా దాడులు జరగడంతో గ్రామంలో తీవ్ర భయాందోళన నెలకొంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎవరూ సురక్షితంగా లేరనే పరిస్థితి ఏర్పడింది. ఇంటి బయట అడుగుపెట్టాలన్నా, పిల్లలను పాఠశాలకు పంపాలన్నా ప్రజలు భయపడుతున్నారు. 25 రోజుల క్రితం ఇద్దరిపై కోతులు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. ఆ ఘటన మరవకముందే ఈ నెల 2 తేదీన పాఠశాలకు వెళ్తున్న ఓ చిన్నారిపై విరుచుకుపడ్డాయి. దీంతో చిన్నారి తీవ్ర భయానికి గురైంది. రెండు రోజుల వ్యవధిలోనే ఈ నెల 4వ తేదీన మండల కేంద్రానికి చెందిన గోరంటల రాజన్న గుప్తా రామాలయంలో ప్రదక్షిణలు చేస్తుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. వరుస సంఘటనలు చోటుచేసుకోవడంతో గ్రామంలో ఎప్పుడు, ఎక్కడి నుంచి కోతులు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. కోతుల బెడదతో గ్రామంలో సాధారణ జీవనం పూర్తిగా దెబ్బతింటోంది. మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. పిల్లలు ఇళ్ల ముందు ఆడుకోవడానికి కూడా తల్లిదండ్రులు అనుమతించడం లేదు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయంతోనే ప్రయాణిస్తున్నారు. ఉదయం నడకకు వెళ్లేవారు, ఆలయాలకు వెళ్లే భక్తులు, కిరాణా సరుకుల కోసం బయటకు వచ్చే మహిళలు సైతం కోతుల భయంతో అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ఇళ్లలోకి చొరబడి వంటగదుల్లో ఉన్న ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, కిటికీలు, తలుపులు తెరిచి ఉంటే ఇంట్లోకి ప్రవేశించడం, పైకప్పులపై గుంపులుగా సంచరిస్తూ చిన్నారులను భయపెట్టడం, ఎదురైతే దాడి చేయడం నిత్యకృత్యంగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు. పలుచోట్ల ఇంటి పైకప్పులపై ఉన్న నీటి ట్యాంకులు, పాత్రలను కూడా ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు అటవీశాఖ, గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఘటన జరిగిన తర్వాత అధికారులు వచ్చి పరిశీలించడం, హామీలు ఇవ్వడం తప్ప కోతులను పట్టుకునే చర్యలు మాత్రం చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో వరుసగా దాడులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు అంటున్నారు. "ఇంకెంతమంది గాయపడితే అధికారులు మేల్కొంటారు? ప్రాణనష్టం జరిగితేనే స్పందిస్తారా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. మరో ప్రమాదం జరగకముందే కోతులను పట్టుకుని గ్రామానికి దూరంగా తరలించాలని, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# హరీష్‌రావుకు టీపీసీసీ చీఫ్ బిగ్ ఆఫర్..

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలకు వచ్చి కన్విన్స్ చేస్తే.. మూడేళ్లు ఆయనకే కాళేశ్వరం అప్పగిస్తానని చెప్పారు. దీని పైన హరీష్ స్పందించారు. కాళేశ్వరం నీటి వినియోగం పైన వివరించారు. కేసీఆర్ వరకు అవసరం లేదని.. తనకు ఇరిగేషన్ శాఖ అప్పగిస్తే.. తానే నిర్వహించి చూపిస్తానని సవాల్ చేసారు. దీని పైన స్పందించిన టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేసారు. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామని చెప్పారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకునే అంశం పైన నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. హరీష్ గతంలో ఇరిగేషన్ మంత్రిగా చేసారని.. పదేళ్లు ఏం చేయని వీరు మూడు నెలల సమయం ఇస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అదే విధంగా తాజా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి వివాదం పైనా స్పందించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజంగా ఉంటాయని చెప్పారు. పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని.. దుర్వినియోగం చేస్తే చూస్తూ ఉండమని స్పష్టం చేసారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అ వివుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామని చెప్పిన మహేష్ గౌడ్...పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని చెప్పుకొచ్చారు . సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదని వ్యాఖ్యానించారు.

# 'సర్' పేరుతో ఓటీపీ అడుగుతున్నారా..

(మొదటి పేజీ తరువాయి)



కాల్‌ను నిలిపివేసి 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు సూచించారు. అలాగే ఓటర్లకు సంబంధించిన సేవలు, ధృవీకరణలు, వివరాల నవీకరణ కోసం కేవలం భారత ఎన్నికల సంఘం అధికారిక ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఏ పరిస్థితుల్లోనూ ఓటీపీని ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ మోసాలపై కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా అవగాహన కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దమ్మపేట శివాలయం దేవుడి మన్యంలో చారిత్రాత్మక ఘట్టం

- పది ఎకరాల భూమికి బోరు మోటర్ ఏర్పాటు
- దేవాలయ ఆదాయానికి కొత్త మార్గం



**దమ్మపేట జులై 10 (పీపుల్స్ డైరీ) :** దమ్మపేటలో అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం, దమ్మపేట శివాలయం దేవుడి మన్యంలో ఎన్నో ఏళ్ల చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం చోటుచేసుకుంది. దేవుడి మన్యంలో ఉన్న పది ఎకరాల భూమిలో తొలిసారిగా బోరు మోటర్ ఏర్పాటుచేసి, ఆ భూమిని కౌలుకు ఇవ్వడం ద్వారా దేవాలయానికి శాశ్వత ఆదాయ మార్గాన్ని కల్పించడం భక్తులు, గ్రామస్తుల ప్రశంసలను అందుకుంటోంది. ఇప్పటి వరకు దేవుడి మన్యంలో ఉన్న భూమి పూర్తిస్థాయిలో వినియోగంలో లేకపోవడంతో దేవాలయానికి ఆశించిన ఆదాయం అందడం లేదు. తాజాగా ఏర్పాటు చేసిన బోరు మోటర్‌తో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. దీంతో పది ఎకరాల భూమి వ్యవసాయానికి అనుకూలంగా మారి, కౌలు ద్వారా దేవాలయానికి నిరంతర ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడింది.

దేవుడి మన్యంలో కొత్తగా నిర్మించిన బోరు మోటారును దేవాలయ చైర్మన్ పానకాల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ధారా మల్లికార్జునరావు, చిన్న శెట్టి చిట్టిబాబు చేతుల మీదుగా ప్రారంభించి ఆన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేవాలయ ఆస్తులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రైతులు, దమ్మపేట గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "దేవుడి మన్యంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమం గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది ఆలయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది" అని అభిప్రాయపడ్డారు. దేవాలయ ఆస్తులను సంరక్షిస్తూ వాటిని అభివృద్ధి దిశగా వినియోగించేందుకు తీసుకున్న ఈ చర్య ఇతర దేవాలయాలకు సైతం ఆదర్శంగా నిలుస్తుందని భక్తులు పేర్కొన్నారు.

# బీరన్న బోనాల పండగకు ఏర్పాట్లు చేయండి

## మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**పీపుల్స్‌డైరీ–వరంగల్ :** ఈనెల 25న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించు కొని 42వ డివిజన్ రంగ సాయిపేటలో బీరన్న బోనాల పండగ అత్యంత వైభవోపేతంగా నిర్వహించ నున్నారు. ఈ పండగ సందర్భంగా ఏర్పాట్ల కోసం మున్సిపల్ కమిషనర్ టి వెంకన్నను డివిజన్లోని కురుమ సంఘం అధ్యక్షుడు మండల హరీష్, ప్రధాన కార్యదర్శి జీనుక రమేష్ లు కలిసి బీరన్న బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై వినతి పత్రం అందజేశారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
శుక్రవారం, 11 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 125


# వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం



**జమ్మికుంట. జులై 10.పీపుల్స్ డైరీ :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం విజయవంతం అయ్యిందని విద్యార్థి సంఘ నాయకులు కొలుగూరి సూర్యకిరణ్, రామారపు వెంకటేశ్ తెలిపారు ఈ స ందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం పై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని రాష్ట్రంలో విద్యారంగం అధ్వానంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలలో లెక్కలేనన్ని హామీలు ఇచ్చిందని కానీ వాటిని నెరవేర్చడంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయవలసిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తుందని మండిపడ్డారు సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4000 క్లస్టర్ స్కూల్స్ గా విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహారించుకోవాలని ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ బకాయిలు సుమారు 7000 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా విద్యాధికారులను నియమించాలని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు తక్షణమే న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించి విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా మెరుగైన సౌకర్యాలు వసతులు కల్పిం చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు రాంపల్లి రోహిత్ రాహుల్ సాయి తేజ సందీప్ నవీన్ బన్నీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# వార్త రాసిన జర్నలిస్టుకు బెదిరింపులు.. దొమ్మటి వెంకన్నపై పోలీసులకు ఫిర్యాదు

- **ప్రజా సమస్యలపై కథనం ప్రచురించడమే కారణమని ఆరోపణ..**
- **ఆడియో రికార్డుతో వీణవంక పోలీసులను ఆశ్రయించిన జాతీయ భూమి ఎడిటర్ పంతాటి రవీందర్**

**జమ్మికుంట/, జూలై 10:పీపుల్స్ డైరీ.:** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ వార్తలు ప్రచురించినందుకు తనను తీవ్రంగా బెదిరించారని ఆరోపిస్తూ జాతీయ భూమి తెలుగు దినపత్రిక ఎడిటర్, జర్నలిస్టు పంతాటి రవీందర్ వీణవంక పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. వల్బభాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు శంకరయ్య, లక్ష్మి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఫిర్యాదు చేయగా, వారి వాదన ఆధారంగా వార్త ప్రచురించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, వృద్ధ దంపతులకు ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా వారిని బెదిరిస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొం టున్న దొమ్మటి వెంకన్నపై వార్త ప్రచురిం చడంతో అతడు ఆగ్రహానికి గురయ్యాడని పేర్కొన్నారు. అనంతరం ఒక పాత్రికేయ మిత్రునికి ఫోన్ చేసి, “నీ అంతు చూస్తా... నిన్ను వదిలిపెట్టను” అంటూ తనను లక్ష్యంగా చేసుకుని తీవ్ర హెచ్చరికలు చేశాడని రవీందర్ ఆరోపించారు. ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డును సాక్ష్యంగా పోలీసులకు అందజేసినట్లు తెలిపారు.ప్రజా ప్రయోజనాల కోసం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా బాధ్యతల పరిధిలో వార్తలు ప్రచురించడం తన వృత్తి ధర్మమని, అలాంటి విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టును బెదిరించడం చట్టవిరుద్ధమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భద్రతపైనా ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. దొమ్మటి వెంకన్న వల్ల తనకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు పూర్తి బాధ్యత అతనిదేనని ఫిర్యాదులో స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద దొమ్మటి వెంకన్నపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు, తన కుటుంబ సభ్యులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని వీణవంక పోలీసులను కోరారు.



# పాఠశాలల మూసివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలి

**డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి**

**జమ్మికుంట. జులై 10 పీపుల్స్ డైరీ :** డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శంకరపట్నం మండలంలో నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి “తెలంగాణలో ఒక్క పాఠశాల కూడా మూతపడదు” అని ప్రకటించినా, ప్రస్తుతం రాష్ట్రంలోని 27,000 పాఠశాలల్లో 23,000 పాఠశాలలను మూసివేస్తామని చేసిన ప్రకటనను తీవ్రంగా ఖండించారు. ఈ దుర్మార్గమైన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ గడువు మూడేళ్లు దాటినా ఇంకా నివేదిక అమలు కాకపోవడం అన్యాయమని, వెంటనే కమిటీ నివేదిక తెచ్చి అమలు చేయాలని కోరారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని దుస్థితి అని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా విధివిధానాలు నిర్ణయించకుండానే ప్రీమియం మొత్తాలను జీతాల నుంచి కట్ చేయడం తీవ్ర అన్యాయమని, ఉద్యోగులకు తెలియ కుండా జరుగుతున్న ఈ చర్యను వెంటనే ఆపాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అయినా పుస్తకాలు పూర్తి స్థాయిలో అందకపోవడం, యూనిఫాం పంపిణీ చేయకపోవడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తోందని విమర్శించారు. ఈ సమస్యలన్నీ తక్షణం పరిష్కరించకపోతే డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి తీవ్ర ఉద్యమానికి దిగతామని ఆవాల నరహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి, జిల్లా కార్యదర్శి ఎస్. చక్రధర్, శంకరపట్నం మండల అధ్యక్షుడు ఎం.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



# చిన్నారుల విద్యకు అంగన్వాడీ కేంద్రం తొలి మెట్టు

- **చిన్నారులకు ఎస్సై సుధాకర్ కుర్చీల బహుకరణ**
- **అంగన్వాడీ కేంద్రంలో ఎస్సై కూతురు విద్యాభ్యాసం**

**రేగొండ, జూలై 10 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో శుక్రవారం నాలుగవ అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు రేగొండ ఎస్సై సుధాకర్ కుర్చీలు బహుకరించారు. రేగొండ మండల కేంద్రంలో నీ నాలుగవ అంగన్వాడీ పాఠశాలలో ఎస్సై సుధాకర్ దంపతుల కూతురు విద్యాభ్యాసం చేస్తున్నారు..కాగా అంగన్వాడీ సెంటర్ ను సందర్శించిన ఎస్సై సుధాకర్ చిన్నారులను చూసి ముచ్చట పడ్డారు..చిన్నారులు కింద కూర్చోవడం చూసి వారికోసం పదిహేను కుర్చీలు బహుకరించారు..ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ.చిన్నారుల విద్యకు అంగన్వాడీ కేంద్రాలు తొలి మెట్టు అన్నారు.ఇంత చిన్న వయసులో సెంటర్ కు వచ్చి చదువుకోవడం సంతోషంగ్ ఉంది అని చిన్నారులు దినదినం విద్యలో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశీర్వదించారు..

**అంగన్వాడీ టీచర్ రజిత మాట్లాడుతూ..**

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తుందని దాతలు సహకరిస్తే, మరింత వసతులు చిన్నారులకు ఏర్పడతాయని అన్నారు. అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులు నేలపై కూర్చుని అక్షర జ్ఞానం నేరుస్తున్న చిన్నారులకు పదిహేను కుర్చీలు స్థానిక ఎస్ఐ సుధాకర్ బహుకరించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు కుర్చీలపై కూర్చుని చదువుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు దాతలు తమ వంతు సహకారం అంగన్వాడీ కేంద్రాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెల్పర్ శ్రీలత, మహిళ సంఘం అధ్యక్షురాలు సుమలత, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..



## జిల్లా ఆత్మచైర్మన్ నియామకానికి సహకరించిన...

**ములుగు జిల్లా, ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు**

**ఏటూరు నాగారం జులై 10 (పీపుల్స్ డైరీ) :** నాపై విశ్వాసం ఉంచి ములుగు జిల్లా ఆత్మ (గూపీహా) చైర్మన్ బాధ్యతలను అప్పగించిన మంత్రి దనసరి అనసూయ సీతక్కకి, ములుగు డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్ కి, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్ కి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ కళ్యాణి కి రఘు హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ములుగు జిల్లా డీఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మ కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆశీస్సులు అందించిన రాష్ట్ర, జిల్లా, మండల, బ్లాక్, గ్రామ స్థాయి నాయకులకు, వివిధ చైర్మన్‌లకు, సర్పంచ్‌లకు, అన్ని అనుబంధ సంఘాల నాయకులకు, ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులకు, మహిళా నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నాపై ఉంచిన ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు వద్దకు చేరేలా పనిచేస్తూ, రైతుల అభ్యున్నతే నా లక్ష్యంగా ముందుకు సాగుతానని అన్ని విధాలుగా తోడ్పడుతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



## దశ దిన కర్మలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు



**ఏటూరు నాగారం జూలై 10 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల మండలం లోని చిన్నబోనపల్లి గ్రామ మాజీ పార్టీ అధ్యక్షుడు తిప్పనబోయిన రామకృష్ణ మృతి చెందగా శుక్రవారం ఆయన దశ దిన కర్మలో బీ ఆర్ ఎస్ నాయకులు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పాల్గొని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమ పార్టీ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, దడిగల సమ్మయ్య, రామ్నార్సయ, కావేరి చిన్ని కృష్ణ, ఎండి కాజపాష, రమేష్, ఉప సర్పంచ్ ఎల్లయ్యా, పోరిక శ్రీనివాస్,చిన్నబోయినపల్లి సర్పంచ్ నాగార్జున పోరిక శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేగొండలో బస్టాండ్ నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు.

**ఆమ్ ఆద్మీ పార్టీ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ డిమాండ్...**



**రేగొండ జూలై 10 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ అన్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణం కొనసాగిస్తున్నారని ఇది చూసిన కూడా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిత్యం హైవే రోడ్ పైన పెద్ద పెద్ద వాహనాలు వెళుతూ ఉంటాయని రోడ్డుమీద నిలుచొని బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా ఎమ్మెల్యే చూస్తూ వెళుతున్నారు తప్ప పట్టించుకోవడం లేదునీ ఎమ్మెల్యేగా గెలిచి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇంత వరకు బస్టాండ్ నిర్మాణం ఏర్పాటు పూర్తి కాకపోవడం ఆయన పనితీరుకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై స్పందిస్తూ రేగొండ మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని అరవింద్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోశాధికారి వాసాల శ్రావణ్ కుమార్ రేగొండ ప్రజలు ప్రయాణికులు పాల్గొన్నారు ...

## విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ముందస్తు జన్మదిన వేడుకల్లో ..**



**ఇల్లంతకుంట జూలై 10 పీపుల్స్ డైరీ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ శ్రీ బండి సంజయ్ కుమార్ 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తు జన్మదిన వేడుకలను ఇల్లందకుంట మండల కేంద్రంలోని కనగర్తి గ్రామ జెడ్ పి హెచ్ఎస్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్ కుమార్ వీర అభిమాని మట్ట పవన్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ, “విద్యే సమాజ అభివృద్ధికి పునాది” అనే భావనతో ఈ చిన్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా, బండి సంజయ్ అన్న ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో నిండి దీర్ఘాయుష్షుతో ఉండాలని, ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులు, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి,ఉప్పుల శ్రీనివాసరెడ్డి,బచ్చల భానుచందర్,అరవింద్ రెడ్డి,ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట జులై 10 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణ పరిధిలోని 14వ వార్డులో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ 14వ వార్డులో మన ఇంటి చుట్టూ పరిసరాలలో ఎక్కువ కాలి స్థలం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ భాగస్వాములై కాలి స్థలంలో మొక్కలు నాటడం ద్వారా మన ఇంటి పరిసరాలు ప్రశాంత వాతావరణంతో ఉంటుంది మరియు మనం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మైస శిరీష రవి,స్వామి,రాజు,శివ, కుమార్,భాస్కర్,రాజేంద్రప్రసాద్, ఆర్ పి ,ఆశ వర్కర్స్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## కోటంచ రాజాగోపురం పనులు ప్రారంభం



**రేగొండ జూలై 10 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులతో కలసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు.గత ఏడాది కోటంచ ఆలయ నిర్మాణం గర్భగుడి,కళ్యాణ మండపం,పూర్తి అయ్యాయి. ఆలయం చుట్టూ నాలుగు దిక్కులు రాజగోపురాలు నిర్మాణ పనులు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రారంభించగా ముఖ్యతిదిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,పాల్గొని రాయితో నిర్మించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.రాజగోపుర నిర్మాణం అనంతరం ఆలయానికి శోభ వస్తుందని ఆకాంక్షించారు.జాతర వరకు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తలు, నాయకులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

## హనుమకొండ డిపో మేనేజర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



**భీమదేవరపల్లి జూలై 10 (పీపుల్స్ డైరీ ) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య మాట్లాడుతూ: మండల జర్నలిస్టులకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం ఉండి, ఇతర జిల్లాలకు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే జిల్లా జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా మూడో వంతు (1/3) రాయితీ మాత్రమే ఉండటంతో ఆర్థికంగా భారం పడుతోందన్నారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ, మహిళల తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు 1/3 వంతు ఛార్జీలకే ప్రయాణించే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ సాతూరి చంద్రమౌళి, ముఖ్య నాయకులు రాంపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి అశోక్, బొల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

## నాలుగు కిలోల బరువున్న కణితిని విజయవంతంగా తొలగించిన వైద్యులు



**హుజూరాబాద్, జూలై 10 (పీపుల్స్ డైరీ) :**హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు శుక్రవారం అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, సుమారు నాలుగు కిలోల బరువున్న కణితిని తొలగించారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల కొమురమ్మ అనే మహిళ గత కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం రెండు రోజుల క్రితం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించింది. వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమె కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. అనంతరం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించి, సుమారు నాలుగు కిలోల బరువున్న కణితిని విజయవంతంగా తొలగించారు.ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

# జి ఎన్ ఎన్ ఎస్ కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో నవధాన్యాల ఫీల్డ్ వద్ద క్షేత్ర ప్రదర్శన



**జమ్మికుంట. జులై 10 పీపుల్స్ డైరీ :** ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ లో భాగంగా ఈరోజు సైదాబాద్ గ్రామంలో జి ఎన్ ఎన్ ఎస్ కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతాప్ స్వరూప నవధాన్యాల ఫీల్డ్ వద్ద క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుమార్ నవధాన్యాలు చల్లుకోవడం వల్ల కలిగే ఉపయోగాల గురించి రైతులకు వివరించడం జరిగింది . అలాగే 9 నుంచి 30 రకాల నవధాన్యాలు చల్లుకున్నట్లయితే వాటి వేళ్ళ నుండి వేరు బుడిపెలు వేర్లపై ఏర్పడే ప్రయోజనకరమైన సూక్ష్మ జీవులు నత్రజనిని స్థిరీకరించే రైజోబియం వంటి బాక్టీరియాకు ఆశ్రయం ఇస్తాయని క్లుప్తంగా రైతులకు వివరించడం జరిగింది. అలాగే చల్లిన నవధాన్యాలను 35 నుండి 40 రోజుల మధ్యలో పొలంలో కలియదున్నలని రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మరియు ఫీల్డ్ కో-ఆర్డినేటర్స్ దాట్ల రమాదేవి, రాము , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ

## అవగాహన కల్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని



**హుజూరాబాద్, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ ఫారాలను సంబంధిత బీఎల్ఓకు అందజేశారు.అనంతరం పట్టణంలోని 16వ వార్డులో స్వయంగా ఎస్ఐఆర్ ఫారాలను నింపి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండ వెన్నెల నవీన్, బీఎల్ఓ, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తాం

- విద్యాసంస్థల బంద్ విజయవంతం
- సొతుకు ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు




**భూపాలపల్లి జూలై 10 పీపుల్స్ డైరీ :** వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో బంద్ విజయవంతంగా కొనసాగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ నాయకులు సొతుకు ప్రవీణ్ కుమార్,నేరెళ్ల జోసెఫ్, కుమ్మరి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళా శాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభు త్వాన్ని కోరారు. స్వయంగా ముఖ్య మంత్రి విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం అత్యంత దుర దృష్టకరమని విమర్శిం చారు. విద్యార ంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే విరమిం చుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల వి ద్యార్థులు, తల్లి దండ్రులు, అ ధ్యాపకులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మెట్టు అనిల్, కిరణ్, పోతుల పవన్, సాయిరాం, శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

- ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**భూపాలపల్లి జూలై 10 పీపుల్స్ డైరీ :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ తెలిపారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గాలలో సాధారణ నివాసితులు అర్హులైన వారు ఓటరుగా నమోదు కావోచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహిం చాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ ంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు త్వరిత గతిన పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 99.52 శాతం ఎన్యూమ రేషన్ ఫారాలు పంపిణీ పూర్తి అయిందని, డిజిటలైజేషన్ 37.36 శాతం జరిగి నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు పారదర్శకంగా డిజి టలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సహాయకులను నియమిస్తామని తెలిపారు. అలాగే మండల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు విజయలక్ష్మి, అబ్బాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ డిపో సూపరింటెండెంట్‌కు జర్నలిస్టులు వినతి



**జమ్మికుంట. జూలై 10 పీపుల్స్ డైరీ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు (ఒజీఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ ల బృందం ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది.ఆర్టీసీ డిపో మేనేజర్ కు జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గురించి విజ్ఞప్తి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ సంస్థకు కూడా సేవలందిస్తున్న విషయం తమరికి తెలిసిందే. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా మాయొక్క జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అయితే గత కొంతకాలంగా 1/3 చార్జీలు అంటూనే దాదాపు 50% చార్జీలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల జర్నలిస్టు లకు భారమవుతుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులకు ఈ 1/3 చార్జీలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపో యినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభు త్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారు. అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి రావడం వల్ల వారిపై ప్రయాణ చార్జీల భారం పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...మా కొద్దిమంది జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరం. కావున దయచేసి జర్నలిస్టులకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదు-పాయం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సంద్యేల వెంకన్న. ఇప్పకాయల సాగర్ కొంగల కుమార్. ఎం ఏ రషీద్. తిప్పరపు రవి. నంద తిరుపతి. కొంకట స్వామి. తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి

## అఖిల భారత విద్యార్థి సమాఖ్య AISF అధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బందు విజయవంతం

- ప్రభుత్వ పాఠశాలలో విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలి



**ఆళ్ళపల్లి జూలై 10(పీపుల్స్ డైరీ) :** ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి తాళ్ళపల్లి వినయ్, డిమాండ్ ఆళ్లపల్లి జులై 10: అఖిల భారత విద్యార్థి సమాఖ్య AISF అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్ లో భాగంగా ఆళ్లపల్లి మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలకు,కళాశాలలో బంద్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా AISF ఆళ్లపల్లి మండల కార్యదర్శి తాళ్ళపల్లి వినయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ మంత్రి ని కేటాయించాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేసిందని వారు ఆరోపించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల కస్టర్ గా తగ్గిస్తామన్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలకు పిలుపునిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం కాలయాపన చేసింది వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల కాకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్ లేకుండా యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయకపోవడం దారుణమని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న 7000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్స్ స్కాలర్షిప్లను విడుదల చేయాలనే డిమాండ్ చేశారు అదేవిధంగా బంధుకు సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు sk అరిఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

**భీమదేవరపల్లి జూలై 10(పీపుల్స్ డైరీ ) :**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (సర్ ) లో భాగంగా భీమదేవరపల్లి మండల పరిధిలోని ఓటర్ల వివరాల సేకరణ కొరకు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, రాబోయే రెండు రోజులలోపు మీ సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ కు తప్పనిసరిగా అందజేయవలసిందిగా తహసీల్దార్ రాజేష్ కోరారు.సమర్పించిన ఫారాలను నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో డిజిటైజ్ చేయాల్సి ఉన్నందున, ఓటర్లు ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే తమ ఫారాలను సమర్పించాలని కోరారు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించడం ప్రతి ఒక్క ఓటరు యొక్క ప్రాథమిక బాధ్యత. ఫారం సమర్పించని పక్షంలో మీ ఓటరు వివరాలలో మార్పులు/చేర్పులకు ఇబ్బంది కలిగి, ఓటరు వివరాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. మీ అమూల్యమైన ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి వెంటనే స్పందించి ఈ ప్రక్రియను పూర్తి చేయాలి.మండలంలోని ఓటర్లందరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు పొరుగువారికి కూడా ఈ సమాచారాన్ని తెలియజేసి, అందరూ నిర్ణీత గడువులోపు తమ ఎన్యుమరేషన్ ఫారాలను బి ఎల్ ఒ లకు సమర్పించేలా సహకరించాల్సిందిగా కోరారు.

సంపుటి : 18, సంచిక : 125

# ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ తో ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షులు భేటీ



**భీమదేవరపల్లి జూలై 10(పీపుల్స్ డైరీ ) :** ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి శుక్రవారం భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యవసాయ వ్యాపార విభాగం ప్రభుత్వ ప్రాయోజిత పథకాల చీఫ్ మేనేజర్ గోవింద్ నారాయణ్ గోయల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ - ముల్కనూర్ సంఘం మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న భాగస్వామ్యం, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్ సహకార అవకాశాలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ సహకార సంఘం గత 70 సంవత్సరాలుగా రైతులకు అందిస్తున్న సమగ్ర సేవలను అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వివరించారు. వ్యవసాయ రుణాలు,పొదుపు సేవలు, పంటల కొనుగోలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి-పంపిణీ, ఎరువుల సరఫరా, గిడ్డంగుల సదుపాయాలు, పాల ఉత్పత్తి అభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పారదర్శక పాలన వంటి అంశాలను సీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముల్కనూర్ సహకార సంఘం దేశ సహకార రంగానికే ఆదర్శంగా నిలవడం అభినందనీయమని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ గోవింద్ నారాయణ్ గోయల్ కొనియాడారు. ముఖ్యంగా ముల్కనూర్ పరిధిలోని రైతులు రుణాల చెల్లింపులో ప్రదర్శిస్తున్న అత్యుత్తమ క్రమశిక్షణ (రీ పేమెంట్ ) ఎస్‌బీఐకి ఎంతో విశ్వాసాన్ని కలిగించిందని, రైతులు-సహకార సంఘం-బ్యాంకు మధ్య ఉన్న ఈ పరస్పర నమ్మకం దేశవ్యాప్తంగా ఒక గొప్ప నమూనాగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ముల్కనూర్ సహకార సంఘంతో ఎస్‌బీఐ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని గోవింద్ నారాయణ్ గోయల్ హామీ ఇచ్చారు. వ్యవసాయ రుణాలు,మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక సహకారం, నూతన ఆర్థిక సేవల విస్తరణ వంటి అన్ని రంగాల్లో ఎస్‌బీఐ తరఫున పూర్తి స్థాయి వృత్తిపరమైన సహకారాన్ని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశం ఎస్‌బీఐ, ముల్కనూర్ సంఘం మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా.. గ్రామీణాభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఇరువర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ముల్కనూర్ సహకార సంఘానికి జాతీయ స్థాయి "ఫార్మర్-సెంట్రిక్ ఇంపాక్ట్ ఎక్సెన్స్" అవార్డు




**భీమదేవరపల్లి జూలై 10 (పీపుల్స్ డైరీ ) :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, సహకార రంగానికి ఆదర్శంగా నిలిచిన ముల్కనూర్ కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ ఉ మార్కెటింగ్ సొసైటీ మరో అంతర్జాతీయ, జాతీయ స్థాయి అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా నిర్వహించిన 'ఇండియా సీడ్ ట్రేడ్ ఉ ఇన్నోవేషన్ సమ్మిట్ 2026' లో ముల్కనూర్ సహకార సంఘానికి ప్రతిష్టాత్మకమైన "ఫార్మర్-సెంట్రిక్ ఇంపాక్ట్ ఎక్సెన్స్" అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ఇక్రిసాట్ వేదికగా జరిగిన ఈ సదస్సులో... ప్రపంచ విత్తన వాణిజ్యం, ఆవిష్కరణలు సుస్థిర వ్యవసాయ రంగాల్లో విశేష కృషి చేసినందుకు గాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విత్తన కంపెనీలు, వ్యవసాయ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ నిపుణుల సమక్షంలో, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ముల్కనూర్ సహకార సంఘం తరపున జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి అందుకున్నారు. విత్తన ఉత్పత్తి కార్యక్రమాల ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మార్చడంలో ముల్కనూర్ కీలక పాత్ర పోషించింది. తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన వరి విత్తనాల ఉత్పత్తి, శుద్ధి విక్రయాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచింది. ఈ వినూత్న విధానం ద్వారా రైతు-సభ్యులకు నాణ్యత భరోసా, మెరుగైన మార్కెట్ అవకాశాలు, గరిష్ట రాబడిని కల్పించింది. అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ముల్కనూర్ సహకార సంఘం సేవలకు జాతీయ వేదికపై ఇంతటి ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించడం పట్ల అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఈ గౌరవం ముల్కనూర్ సంఘం సాధించిన నిరంతర విజయానికి ప్రతిరూపం. రైతు సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసిన మన రైతు-సభ్యులు, ఉద్యోగులు, భాగస్వామ్య వర్గాలందరి కష్టానికి దక్కిన ఫలితం ఇది" అని పేర్కొంటూ ఈ అవార్డును వారికే అంకితం చేశారు.

# ప్రజా సమస్యలపై కథనం ప్రచురించడమే నేరమా

- వార్త రాసిన జర్నలిస్టుకు బెదిరింపులు
- దొమ్మటి వెంకన్నపై పోలీసులకు ఫిర్యాదు



**వీణవంక జులై 11 ( పీపుల్స్ డైరీ) :** ఆడియో రికార్డుతో వీణవంక పోలీసులను ఆశ్రయించిన జాతీయ భూమి ఎడిటర్ పంతాటి రవీందర్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ వార్తలు ప్రచురించినందుకు తనను తీవ్రంగా బెదిరించారని పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వల్బభాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు శంకరయ్య, లక్ష్మి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఫిర్యాదు చేయగా, వారి వాదన ఆధారంగా వార్త ప్రచురించిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, వృద్ధ దంపతులకు ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా వారిని బెదిరిస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న దొమ్మటి వెంకన్నపై వార్త ప్రచురించడంతో అతడు ఆగ్రహానికి గురయ్యాడని పేర్కొన్నారు. అనంతరం ఒక పాత్రికేయ మిత్రునికి ఫోన్ చేసి, "నీ అంతు చూస్తా. నిన్ను వదిలిపెట్టను" అంటూ తనను లక్ష్యంగా చేసుకుని తీవ్ర హెచ్చరికలు చేశాడని రవీందర్ ఆరోపించారు. ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డును సాక్ష్యంగా పోలీసులకు అందజేసినట్లు తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా బాధ్యతల పరిధిలో వార్తలు ప్రచురించడం తన వృత్తి ధర్మమని, అలాంటి విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టును బెదిరించడం చట్టవిరుద్ధమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన వ్యక్తిగత భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భద్రతపైనా ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. దొమ్మటి వెంకన్న వల్ల తనకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు పూర్తి బాధ్యత అతనిదేనని ఫిర్యాదులో స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద దొమ్మటి వెంకన్నపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు, తన కుటుంబ సభ్యులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

# ఆయిల్ ఫామ్ సాగుతూనే రైతులకు మేలు


**మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు**



**అక్కన్నపేట, జులై 10, ( మానేటి న్యూస్ ):.** భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ మార్పులను తట్టుకొని స్థిరమైన ఆదాయం సాధించేందుకు రైతాంగం సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తమ ఎనిమిది ఎకరాల పొలంలో ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు వచ్చిన స్థానిక రైతు సంపత్ ను మంత్రులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... జిల్లాలో 50వేల ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రస్తుతం 14 వేల ఎకరాల్లో సాగు జరుగుతుందని తెలిపారు. మునుముందు ఎల్ నేను ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వచ్చే ముప్పు ఉన్నందున రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు వెళ్ళమని సూచించారు. ఆయిల్ ఫామ్ కు నీటి అవసరం చాలా తక్కువ అని కోతుల బెడద ఉండదని తోట వేసిన నాలుగేళ్ల వరకు ఇతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరాకు 50 వేల పాటు రైతు భరోసా కూడా అందిస్తుందని వివరించారు తన కోట నుంచి మరో ఐదు లక్షలు..... సాగును ప్రోత్సహించేందుకు చిన్న గ్రామాల్లో 100 ఎకరాలు దాటిస్తే 5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాల పైన సాగు పెంచితే 10 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. నర్మెటలో ప్రారంభమైన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మనకు కూతవేటు దూరంలోనే ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని వాడుకోవాలని కోరారు. ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.... అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం వల్ల వంటనూనెల దిగుమతులు కష్టతరమైన ధరలు పెరుగు తున్నాయని, దేశీయంగా మనమే ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్లు ఓపిక పడితే ఆయిల్ ఫామ్ ద్వారా రైతులు అద్భుతమైన లాభాలు గడించవచ్చు, వడ్ల కొనుగోలు అదనంగా చేసిన ఎఫ్సీఐ తీసుకోవడం లేదు, గోదాములు నిండిపోయాయి కాబట్టి ప్రత్యామ్నాయ పంటలే మేలు అని పేర్కొన్నారు. ఒక గ్రామంలో 100 ఎకరాల్లో సాగు పూర్తి చేస్తే మంత్రి పున్నం ఇచ్చే 5 లక్షల ప్రోత్సాహకానికి అదనంగా జిల్లా ఇన్చార్జి మంత్రిగా తన కోట నుంచి మరో 5 లక్షలు మొత్తం పది లక్షలు గ్రామ అభివృద్ధికి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏపీ సి ఎస్ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

**హుజూరాబాద్ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం**



**హుజూరాబాద్, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ డెమొక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేఫ్), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఁఔజేఫ్) నాయకులు శుక్రవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. డెమొక్రటిక్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మానసాని కృష్ణారావు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఁఔజేఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంతాటి రవీందర్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం డిపో సూపరింటెండెంట్‌ను కలిసి తమ సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ఆర్టీసీ సంస్థ సేవలను కూడా విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. గతంలో జర్నలిస్టులకు అమలులో ఉన్న మూడింట ఒక వంతు (1/3) రాయితీ ప్రస్తుతం సక్రమంగా అమలు కాకపోవ దంతో దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు తక్కువ వేతనాలతోనే విధులు నిర్వర్తిస్తూ, వార్తల సేకరణ కోసం ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, ప్రయాణ ఖర్చులు వారికి అదనపు భారంగా మారాయని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తరహాలోనే జర్నలిస్టులకు కూడా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్ హుజూరాబాద్ అధ్యక్షుడు సంధ్యేల వెంకన్న, ఇప్పకాయల సాగర్, కొంగల కుమార్, ఎం.ఎ. రషీద్, తిప్పారపు రవి, నంద తిరుపతి, కొంకటి స్వామి (పీపుల్స్ డైరీ) తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**హనుమకొండ డిపో మేనేజర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**

**భీమదేవరపల్లి జూలై 10 (పీపుల్స్ డైరీ ) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య మాట్లాడుతూ: మండల జర్నలిస్టులకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం ఉండి, ఇతర జిల్లాలకు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే జిల్లా జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా మూడో వంతు (1/3) రాయితీ మాత్రమే ఉండటంతో ఆర్థికంగా భారం పడుతోందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ, మహిళల తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు 1/3 వంతు ఛార్జీలకే ప్రయాణించే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ సాతూరి చంద్రమౌళి, ముఖ్య నాయకులు రాంపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి అశోక్, బొల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**హుజూరాబాద్, జూలై 9 (పీపుల్స్ డైరీ):** హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పట్టణంలోని 16వ వార్డులో డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండ వెన్నెల నవీన్, సొల్లు సునీత బాబు, సందమల్ల పుణ్య బాబు, వైద్య సిబ్బంది, వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గర్రెపల్లిలో జోరుగా ఎస్ఐఆర్ కార్యక్రమం



**సైదాపూర్ జూలై 10 ( పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం శుక్రవారం జోరుగా నిర్వహించారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మాచమల్ల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కౌడగాని వీరేశం, గ్రామ కార్యదర్శి రాజీవ్, బీఎల్ఓ డి. సరిత, డాక్టర్ రమేష్, గడ్డి రవి తదితరులు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఓటరు జాబితాలో అవసరమైన సవరణలు చేసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.

# పీఎంజేజేబీవై పథకం కింద మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు




**ఆళ్లపల్లి, జూలై 10( పీపుల్స్ డైరీ) :** విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టేకులపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం శుక్రవారం ఆళ్ళపల్లి మండలం బోడాయికుంట గ్రామంలో ఆర్థిక అవగాహన శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బోడాయికుంట గ్రామానికి చెందిన కొమరం వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (ౖపీజీజీడీ) పథకం కింద రూ.2 లక్షల బీమా చెక్కును ఎస్‌బీఐ కంచనపల్లి శాఖ మేనేజర్ వేణు మృతుని భార్య కొమరం సుగుణకు అందజేశారు. ఈ సందర్భంగా బీమా పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి అర్హ కుటుంబం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో చేరి వాటి ప్రయోజనాలను పొందాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో టేకులపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులు ఏ. జగ్య, బొమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత



**కుత్బుల్లాపూర్ప్రతినిధి, జులై 10 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి నూతనంగా నియమితులైన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులకు శుక్రవారం మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ మహిళ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, పార్టీ నాయకులు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్),జులై 11 :**మల్లాపూర్ డివిజన్ (పాత మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీ పంచముఖ హనుమాన్ ఆలయం నుండి ఓల్డ్ మీర్పేట్ హనుమాన్ ఆలయం వరకు నిర్మించదలచిన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీవాసులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా విద్యుత్ తీగల మార్పు వంటి సమస్యలను లేవనెత్తగా మున్సిపల్ జలమండలి, విద్యుత్ అధికారులకు సమన్వయం చేస్తూ త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ వెడల్పునిర్మాణంతో వర్షం నీరు నిలవకుండా, స్థానికంగా నివాస ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటారని, ఈ నిర్మాణం పూర్తయితే డ్రైనేజీ నీరు రోడ్లపైకి రాకుండా ప్రధాన సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజిఎం వేణు గోపాల్, వర్క్ ఇనస్పెక్టర్ బిక్షపతి, కాలనీ అధ్యక్షులు పాండాల నరసింహ గౌడ్, సెక్రటరీ సంజయ్ నాయక్ నాయకులు ఉల్లెం బాలరాజు, కృష్ణ, వాసు చారి, బోనాల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, రిజ్వాన్, అంజనీ ప్రసాద్, ప్రేమ్ సాగర్, స్వామి గౌడ్, శంకర్ గౌడ్, రాజలింగం, అజీజ్, కిట్టు, శేఖర్ గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడ ఐలయ్య గౌడ్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 10 :** దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, రాష్ట్రీ య ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాటమయ్య గౌడ సంఘం అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయానికి గౌడ సంఘం కమిటీ సభ్యులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి తన వంతు పూర్తి సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కాటమయ్య గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బింగి ఇందిరా శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ, దేవాలయంతో పాటు గౌడ హాస్టల్ నిర్మించి యువతకు విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. హాస్టల్ నిర్మాణానికి సంబంధించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ప్రతిపాదన అందజేస్తామని, ఈ కార్యక్రమానికి గౌడ సంఘ సభ్యులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, తాడి సహకార సంఘం డైరెక్టర్లు కే. విఠల్ గౌడ్, దొంతి సాయి గౌడ్, ఈ. మహేష్ గౌడ్, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దూర గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలి

- **అయిలేని మల్లికార్జున్ రెడ్డి-హుస్నాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకుడు**



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 10 :** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్‌చెరువు తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ ధర్మారం, మల్‌చెరువు తండా, రేగొండ, గోవర్ధనగిరి, గౌరవెల్లి, జనగామ, చౌటపల్లి గ్రామాలను అక్కన్నపేట మండలం నుంచి తొలగించి సమీపంలోని హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి హుస్నాబాద్ మండలానికి చెందిన ఈ గ్రామాలను మండలాల పునర్వ్యవస్థీకరణ సమయంలో అక్కన్నపేట మండలంలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే 15 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని, ప్రజల సౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గ్రామాలను దూర ప్రాంత మండలంలో కలిపారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఈ గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని గుర్తు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేస్తామని అప్పటి అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులపై ప్రభుత్వం, మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి సంబంధిత గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు భూక్యా విట్టల్, గుగులోతు శంకర్, అయిలేని గాల్ రెడ్డి, బానోత్ సంతోష్, రంగన్న, భూక్యా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటీసీలతో యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు

- **హుస్నాబాద్‌ను స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం....**
- **రాష్ట్ర మంత్రులు-పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి**



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 10 :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో రూ.45.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఆజ) భవన నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లో ఈ ఏటీసీ ఏర్పాటు కానుంది. ఈ కేంద్రం ద్వారా గ్రామీణ యువతకు అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించి, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏటీసీలో ప్రొడక్ట్ డిజైన్, మాన్యుఫాక్చరింగ్, 3డీ ప్రింటింగ్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, మాన్యుఫాక్చరింగ్ ఎగ్జిక్యూషన్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలు , ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. ఒక్కో కేంద్రంలో 288 మంది శిక్షణ పొందే అవకాశం ఉండగా, ప్రతి శిక్షణార్థికి నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించనున్నారు. అలాగే యూనిఫాంలు, ఆధునిక యంత్రాలు, సాఫ్ట్‌వేర్, శిక్షణ సామగ్రి, అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టులో టాటా టెక్నాలజీస్ రూ.31.05 కోట్లతో యంత్రాలు, సాంకేతిక పరికరాలు, శిక్షణా సామగ్రి అందించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.14.01 కోట్లతో భవన నిర్మాణం, విద్యుత్ పనులు, ఫర్నిచర్, గ్రంథాలయం తదితర వసతులను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 65 ఏటీసీలతో పాటు మరో 54 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, మొత్తం 119 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు అందు బాటులోకి రానున్నాయి.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...**

హుస్నాబాద్ వెనుకబడిన ప్రాంతమనే భావనను పూర్తిగా తొలగించి, రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పర్యాటకం, విద్య, వైద్యం, రహదారులు, పరిశ్రమలు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.45.15 కోట్లతో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ద్వారా 288 మంది విద్యార్థులు ఆధునిక కోర్సుల్లో శిక్షణ పొంది, నెలకు రూ.2 వేల స్టైపెండ్ పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. హుస్నాబాద్‌లో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యా సంస్థల అభివృద్ధితో పాటు ఎల్లమ్మ చెరువు టూరిజం, నాలుగు లైన్ల రహదారి, అర్బన్ ఫారెస్ట్ పార్క్, మహాసముద్రం గండి, భైరవస్వామి ఆలయ అభివృద్ధి వంటి పలు ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల కోసం ప్రభుత్వం రూ.220 కోట్లు కేటాయించిందని, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ...**

తెలంగాణ ఉద్యమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పోరాడిన రోజులను గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి, జర్మనీతో పాటు వివిధ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా ఇప్పటికే వేలాది మంది విదేశీ ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో రూ.4 వేల కోట్లకు పైగా వ్యయంతో 119 ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామని, కొన్ని కేంద్రాల్లో జర్మన్ భాషా శిక్షణతో పాటు స్టైపెండ్ కూడా అందిస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ ఏటీసీ రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని, కేంద్రం ప్రారంభమైన తర్వాత విద్యార్థుల సంఖ్య పెరిగేలా నిరంతరం సమీక్షిస్తానన్నారు. డ్రైవర్లకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేలా ఇక్కడ డ్రైవింగ్ శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లోనే టీచర్ల శిక్షణా తరగతులు నిర్వహించాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు డీటీఎఫ్ వినతి**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 10 :** జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను హుస్నాబాద్ డివిజన్‌లోనూ ఏర్పాటు చేయాలని కోరుతూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సిద్దిపేట జిల్లా నాయకులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలు కేవలం సిద్దిపేట, గజ్వేల్ డివిజన్లలో మాత్రమే నిర్వహిస్తున్నారని, దీంతో హుస్నాబాద్ డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులు శిక్షణ కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రిసోర్స్ పర్సన్లను హుస్నాబాద్‌కు పంపించి ఇక్కడే శిక్షణా తరగతులు నిర్వహిస్తే ఉపాధ్యాయుల ఇబ్బందులు తొల గడంతో పాటు సమయం, ప్రయాణ వ్యయం కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. హుస్నాబాద్ డివిజన్‌ను పరిగణనలోకి తీసుకుని వెంటనే ఇక్కడే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకటరమణారెడ్డి, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బి. ప్రభాకర్ రెడ్డి, హుస్నాబాద్, అక్కన్నపేట మండల ప్రధాన కార్యదర్శులు పి. సంపత్ రెడ్డి, ఏ. మల్లయ్య తదితరులు ఉన్నారు.

# నాయి బ్రాహ్మణులు సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి

- **బీసీ ఏ లోకి ముదిరాజులను చేర్చడాన్ని విరమించుకోవాలి,**
- **దేవాలయాలు జాతర లలో తలనీలాల సేకరణ హక్కులు పూర్తిగా నాయి బ్రాహ్మణులకే కల్పించాలి,-నాయిబ్రాహ్మణ సంఘం**



**ఏటూరు నాగారం జూలై 10 (పీపుల్స్ డైరీ):** నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా ఆహ్వాణ కమిటీ సమావేశము సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షతన ములుగు జిల్లా కేంద్రంలోని లీలాగార్డెన్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేయగా, సమావేశంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ మాట్లాడుతూ తరతరాలుగా నాయి బ్రాహ్మణులు క్షౌరవృత్తినే జీవనాధారంగా ఎంచుకొని ప్రజలకు సేవలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారనీ అన్నారు, అలాంటి వృత్తిని ఈరోజు నాయి బ్రాహ్మణులకు దూరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయి అని అన్నారు, దేవాలయాలలో, జాతరలలో, వృత్తి నిర్వహిస్తున్నా సరియైన ఆదరణ లేక, వృత్తి ద్వారా వస్తున్న ఆదాయం నాయి బ్రాహ్మణులకు దక్కకుండా దేవాదాయ, ధర్మాదాయ శాఖ పేరుతోని అలాగే ఇతర కులాల వారు కూడా ఆదాయం కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు అన్నారు, అందుకోసం వృత్తిపై పూర్తి హక్కులు దక్కేవరకు, వృత్తిలో ఇతర కులాల పెత్తనాలు లేకుండా జరిగే వరకు, సమ-రశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు, అందులో భాగంగా వృత్తిదారులను చైతన్యం చేయడానికి గాను త్వరలో జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో జంపాల సత్యనారాయణ, చెన్న కుమార్, వేల్పుకొండ శరభంధం, బద్దెల సత్యనారాయణ, మద్దూరు రాజు, ఉద్యమారి సంతోష్, కోడెపాక యాధగిరి, కొత్తపెల్లి వెంకన్న, దేవరకొండ మహేష్, జంపాల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు,

# పరిశుభ్రతలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు!

## శానిటేషన్, అర్బన్ మలేరియా నివారణ చర్యలపై సమీక్షలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**మట్టెవాడ, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అర్బన్ మలేరియా విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనధికారికంగా ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో వెంటనే తొలగించాలని సూచించారు. వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్విన్ బిన్స్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనుల పురోగతిని వారానికోసారి సమీక్షకు సమర్పించాలని తెలిపారు. రానున్న 15 రోజుల్లో నగర పారిశుధ్యంలో స్పష్టమైన మార్పు కనిపించేలా కృషి చేయాలని సూచించారు. త్వరలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) యూనిట్ సమర్థవంతంగా పని చేయాలంటే ప్రతిరోజూ 100 టన్నుల తడి చెత్త సేకరించి డంప్‌యార్డుకు తరలించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇటీవల అమ్మవారిపేటలో ప్రారంభమైన 150 కేఎల్‌డీ సామర్థ్యం గల మల శుద్ధీకరణ కేంద్రానికి ప్రతిరోజూ మల వ్యర్థాలను క్రమబద్ధంగా తరలించాలని, నగరంలో అనధికారికంగా మల వ్యర్థాలను పారబోస్తున్న సెప్టిక్ ట్యాంకర్లపై కఠిన చర్యలు తీసుకొని భారీ జరిమానాలు విధించాలని సూచించారు. వాటి కదలికలపై ఫీల్డ్ సిబ్బంది నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. అర్బన్ మలేరియా విభాగం పనితీరును సమీక్షిస్తూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. డ్రైన్లలో దోమల లార్వా నిర్మూలన కోసం స్ప్రేయింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వినియోగం, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్, గోల్కొండ శ్రీను, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి!

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**మట్టెవాడ, జూలై 10 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వొద్దని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాజీపేటలోని మార్కెట్, హనుమకొండలోని మేకలు, గొర్రెల వధశాల, హనుమకొండ ప్రెస్ క్లబ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలోని పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కాజీపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్, హనుమకొండ వధశాలల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకుని, పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్, పనులను మరింత వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్ ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగిస్తూ రోగులు, వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్‌రావు, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, ఏఈ హరికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## చికెన్ దుకాణాల నిర్వహకులకు నోటీసులు జారీ

**గోవిందరావుపేట, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని చికెన్ దుకాణా యాజమాన్యాలకు గోవిందరావుపేట గ్రామపంచాయతీ 2018 పట్టా ప్రకారం కార్యదర్శి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. చికెన్ దుకాణాల వర్గాల వల్ల దుర్వాసన, పరిసర ప్రాంతాలలో దుర్వాసన వెదజల్లడం జరుగుతుందని, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాల గురయ్యే ప్రమాదం ఉందని గ్రామ పంచాయతీ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్ట రిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జారీ చేయబడ్డ నోటీసులో పేర్కొన్నారు.

## మృతుని కుటుంబాకి పరామర్శ



**నల్లబెల్లి, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి గ్రామంలో గ్రామ సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న ఏమునురు కొమరమ్మ అనారోగ్యం కారణంగా శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ ముప్పు కృష్ణ వెంటనే స్పందించి, మృతురాలి నివాసానికి చేరుకున్నారు. తహసిల్దార్ ముప్పు కృష్ణ కొమరమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం తనవంతుగా రూ. 10,000 నగదును అందజేసి, వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్‌తో పాటు మండల గిర్దావర్ మాడ సంపత్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, లక్ష్మీనారాయణ, విఆర్ఏల సంఘం అధ్యక్షులు సదానందం, ఇతర జిపిఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్ఏ కొమరమ్మ మృతి



**నల్లబెల్లి, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండల కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొంది. గత నాలుగు దశాబ్దాలుగా నిస్వార్థంగా సేవలందించిన ఒక నిబద్ధత గల ఉద్యోగినిని ఆ ప్రాంతం కోల్పోయింది. మండల కేంద్రంలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కీసరి కొమరమ్మ శుక్రవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. కొమరమ్మ గత 40 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో సేవకురాలిగా, వీఆర్ఏగా తన విధులను నిర్వర్తించారు. నల్లబెల్లి మండల పరిధిలోని ప్రజలకు, రెవెన్యూ అధికారులకు మధ్య ఆమె ఒక బలమైన వారధిగా నిలిచా రు. నాలుగు దశాబ్దాల పాటు ఎంతో మంది అధికారుల వద్ద పని చేస్తూ, విధుల్లో ఎలాంటి మచ్చ లేకుండా బాధ్య తలు నిర్వహించారు. కొమరమ్మ మరణవార్త తెలియగానే మండల కేంద్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆమె సుదీర్ఘ కాలం పాటు స్థానిక ప్రజలతో మమేకం అవ్వడం వల్ల, ప్రతి ఒక్కరూ ఆమెను తమ కుటుంబ సభ్యురాలిగా భావించారు. ఆమె మృతి పట్ల స్థానిక రెవెన్యూ అధికారులు, తోటి వీఆర్ఏలు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కొమరమ్మ మరణం నల్లబెల్లి రెవెన్యూ రంగానికి మరియు స్థానిక ప్రజలకు తీరని లోటు. ఆమె అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి." అని తోటి సిబ్బంది సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు స్థానిక నేతలు, అధికారులు తమ సానుభూతిని తెలియజేశారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యేకు విన్నపం

### వెంటనే భూ సమస్యకు స్పందన



**నర్సంపేట, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** గురువారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నిర్వహించిన "డయల్ యువర్" ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా..ఒక వ్యక్తి తనకు సంబంధించిన భూ సమస్యను ఫోన్ కాల్ ద్వారా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం బాధితుడిని తన స్వగృహానికి పిలిపించుకొని పూర్తి సమస్యను విని..వెంటనే అట్టి సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు కాల్ చేసి ఆదేశాలు జారీ చేసిన దొంతి మాధవ రెడ్డి ..సమస్య ఏదైనా,సమయం ఏదైనా... ప్రజల కోసం నేనున్నానంటూ 'డయల్ యువర్ ఎమ్మెల్యే' ద్వారా భరోసానిచ్చిన ప్రజా నాయకునికి ప్రశంసలు వచ్చాయి.

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా




**గోవిందరావుపేట, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** అంగన్‌వాడీ నిర్వాహకుల ఆపరిస్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అంగన్వాడీ టీచర్లు నిర్వాహకులు తాసిల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ సోమ మల్లారెడ్డి మాట్లాడుతూ సంవత్సరాల తరబడి అంగన్వాడి వర్కర్స్ నిర్వాహకులకుల సమస్యలపై ధర్నాలు అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు, అంగన్వాడీ టీచర్ల వంట నిర్వాహకుల పలు సమస్యలపై డిమాండ్లతో కూడిన పత్రాన్ని స్థానిక తహసీల్దారుకు అందజేయడం జరిగింది, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచాలని సోమ మల్లారెడ్డి అన్నారు, అంతేకాకుండా అంగన్వాడీ టీచర్లకు నిర్వాహకులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పి ప్రైమరీ పి ఎం - శ్రీ కేంద్రాల విలీన నిర్ణయాలు వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీ కేంద్రాలను బలం బలోపేతం చేయడంతో ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ నెలకు 18 వేల వేతనం అమలు చేయాలని, కాళీ పోస్టులు భర్తీ చేయాలని, అంగన్వాడీ పక్క భవనాలు నిర్మించిమౌలిక సదుపాయాలు కల్పించాలని ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం హామీ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిఏడిఏ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో యూనియన్ మండల కమిటీ సభ్యులు కే. పద్మారాణి, ఎస్. భాగ్యమ్మ, ధనలక్ష్మి, సీహెచ్. అరుంధతి, కే. పద్మావతి, పి. సరిత తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలి



**కేసముద్రం, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** రాజస్థాన్ రాష్ట్రంలో 13 ఏళ్ల మైనర్ బాలికపై 32 మంది దుర్మార్గుల అత్యాచారం చేశారు 5 రోజుల పాటు హత్యాచారం చేసిన దుర్మార్గులను శిక్షించాలి. అత్యంత దారుణం దుర్మార్గమ్ మాటలతో ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరగకుండా ప్రభుత్వం కఠినమై చర్యలు తీసుకోవాలి.. అత్యాచారం చేసిన దుర్మార్గులపై పాస్ట్ ట్రాక్ కోర్టులు నిర్మించి ఉరిశిక్ష పడేవిధంగా చూడాలి. మైనర్ బాలికలపై అత్యాచారం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి ఇలా జరుగుకుంటూ పోతే దేశంలో మహిళలకు మనం భద్రత ఎలా ఇవ్వగలం . మహిళలకు స్వేచ్ఛ స్వతంత్రాలు బావ స్వేచ్ఛ ఉద్యోగ స్వేచ్ఛ మహిళలపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో దేశవ్యాప్తంగా ఖండించాలి. ఈ కార్యక్రమంలో ప్రమీల పద్మ జ్యోతి కల్పన అనూష రజిత నరసమ్మ కవిత భద్రమ్మ భద్రయ్య వెంకటమ్మ సల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి పూరి గుడిసె దగ్ధం




**చిట్యాల, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని అందుకుతండ గ్రామానికి చెందిన దాసరి శ్యామల లక్ష్మీపతి దంపతులకు చెందిన పూరి గుడిసె ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటనలో పూరి గుడిసె తో పాటు ఇంటిలోని 60 వేల నగదు అర తులం బంగారం 8 తులాల వెండి, వస్తువులు పూర్తిగా కాలిపోయాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## పేద మహిళలకు అమ్మవారి చీరల పంపిణీ



**మట్టెవాడ, జూలై 10 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలోని 26వ డివిజన్ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్ అధ్యక్షతన శ్రీ ఎల్లమ్మ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1500 మంది పేద మహిళలకు శుక్రవారం అమ్మవారి చీరలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. అనంతరం బస్వరాజు సారయ్య మాట్లాడుతూ శ్రీ ఎల్లమ్మ దేవస్థాన కమిటీ, మిత్ర యూత్ అసోసియేషన్ లక్ష్మీపురం ఎల్బీనగర్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా అమ్మవారి చీరలను నిరుపేద మహిళలకు పంపిణీ చేయడం పట్ల కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్గొండ రమేష్, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజ్ శ్రీమాన్, జిల్లా యూత్ అధ్యక్షులు కురవి పరమేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోరంటల రాజు, చాగంటి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జ్ సోమ లక్ష్మి, గిరిగిరి పుష్ప, దేవస్థానం కమిటీ నెల్లుట్ల ఎల్లయ్య, ఈగ శంకర్, సలహాదారులు రామ బాబురావు, శనిగరం శ్రీధర్, ప్రతాపగిరి గణేష్, భోగం నాగరాజు, మహారాజు శ్రీకాంత్, నెల్లుట్ల బాబు, నెల్లుట్ల పెద్ద కుమార్, శ్రీరంశెట్టి శ్రీకాంత్, మూర్తి, యుగంధర్, హరికృష్ణ, తత్తరి ప్రసాద్, వెంగల సత్యనారాయణ, శ్యామల కుమార్, పద్మ, వాణి, విజయ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## షిరిడీలో వరంగల్ సభ్యుల పారాయణం, సాయి భజన



**మట్టెవాడ, జూలై 10 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరానికి చెందిన గోవిందాద్రి గోశాల విష్ణు సహస్రనామ పారాయణం గ్రూప్ సభ్యులు సమిష్టి షిరిడి యాత్ర విజయవంతంగా జరుపుకున్నారు. షిరిడీలోని సాయినాధుని సన్నిధిలో పారాయణం, సాయి భజన కొరకు వరంగల్ నుండి దాదాపు 85 మంది సభ్యులు గర్నేపల్లి మాధవి సుధాకర్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బయలుదేరి వెళ్లి షిరిడీలో అంగరంగ వైభవంగా పారాయణం, భజన కార్యక్రమం నిర్వహించారు. షిరిడీలో గ్రూపు మహిళలు, పురుషులు అందరూ ఒకే విధమైన డ్రెస్ కోడ్, ఐడెంటిటీ కార్డు ధరించి భక్తి శ్రద్ధలతో పారాయణం, భజన చేయడం వేలాది మంది భక్తులతో పాటు షిరిడీ సంస్థాన్ సిఈఓ గోరక్ష గడికార్, అధికారుల ప్రశంసలు అందుకున్నారు. సాయి పల్లకి ఉత్సవంలో షిరిడీ పురవీధుల మీదుగా పారాయణం చేసే సాయి మందిరం స్టేజ్ వరకు ఆటపాటలతో సాయి నామాలు పాడుతూ నృత్యాలు చేస్తూ పల్లకి సేవ చేయడం తమ గ్రూపుకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నామని గ్రూపు నిర్వాహకుడు గర్నేపెల్లి సుధాకర్ వెల్లడించారు. ఈ గ్రూపు సభ్యులు స్థానిక అష్టలక్ష్మీ దేవాలయంలో కూడా విష్ణు సహస్రనామ పారాయణం చేసి ఆలయ అధికారుల మన్ననలు పొందడం మరో విశేషం.

## ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత దూషణలే సీఎం ఎజెండా

**ఖమ్మం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** అభివృద్ధి, ప్రగతి అంశాలను వదిలేసి రోత మాటలు, బూతులు, వ్యక్తిగత దూషణలతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్, పువ్వాడ అజయ్ కుమార్ లపై సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడారని మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ విమర్శించారు. సీఎం పర్యటనతో ఖమ్మం జిల్లాకు కొత్తగా ఒరిగిందేమీ లేదని అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో సీఎంగా కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వచ్చిన ప్రతిసారీ వందల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు ప్రకటించేవారని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనల్లో అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి పదవికి రేవంత్ కళంకం తెస్తున్నారని బచ్చు విజయ్ కుమార్ అన్నారు.

# రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో కూడిన 'భూదార్'!

## 'భూభారతి'తో సరికొత్త భూ విప్లవం.. చింతకాని సభలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



**ముల్లుగుమాడ్ రైతులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా రికార్డుల పంపిణీ**

**రెండేళ్లలోనే 71 వేల ఉద్యోగాల భర్తీ.. త్వరలోనే మరో 20 వేల నోటిఫికేషన్లు**

**మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.63 వేల కోట్లు.. ప్రతిపక్షాల అబద్ధాల ప్రచారాలపై మంత్రి పొంగులేటి ఫైర్**

**ఖమ్మం, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** "భూభారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి భూమినీ సర్వే చేసి, సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన 'భూదార్' కార్డును అందజేస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చింతకాని మండలం జగన్నాథపురం వద్ద రాష్ట్ర రైతాంగానికి రూ.9 వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను జమ చేసిన సందర్భంగా నిర్వహించిన చారిత్రాత్మక 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ వేదికపై మంత్రి పొంగులేటి భూ సంస్కరణలతో పాటు ప్రభుత్వ ప్రగతిని వివరించారు.

### ముల్లుగుమాడ్‌లో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్!

ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూభారతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర నియోజకవర్గంలోని ముల్లుగుమాడ్ రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి, సుమారు 476 మంది రైతులకు మ్యాప్‌లతో కూడిన భూదార్ కార్డులను సిద్ధం చేశామన్నారు. ఈ సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతులకు ఈ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఇదే పద్ధతిలో కార్డులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

### నిరుద్యోగులకు వరం... మహిళలకు అండ!

ఈ రెండున్నర ఏళ్లలోనే సుమారు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లను సున్నా వడ్డీకే అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి కొనియాడారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు మొదటి రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో 71 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, రాబోయే కొద్ది రోజుల్లోనే మరో 17 వేల నుంచి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని సగర్వంగా ప్రకటించారు.

### అవినీతి పిల్లర్లపై కాళేశ్వరం..!

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాలేదని, చేతల్లో చూపిస్తోందని మంత్రి అన్నారు. గత పాలకులు తాము చేసిన తప్పులను, అబద్ధాలను ఈ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. "ఎన్నికల ముందే చెప్పాం... కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి పిల్లర్‌లోనూ అవినీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని. ఇవాళ అదే నిజమైంది" అని విమర్శించారు. నీటిపారుదల శాఖపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అబద్ధాల ప్రచారం మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లోనూ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

### పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం!

అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే రేవంత్ అన్న నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మిగిలిన విడతలను కూడా శరవేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

# సర్ గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం



**ఖమ్మం, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జరుగుతున్న జాప్యం, తలెత్తుతున్న ఇబ్బందులను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దృష్టికి బీఆర్ఎస్ ప్రతినిధి తీసుకెళ్లింది. ఈ మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్ తదితరుల బృందం శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసింది. ఈ సందర్భంగా.. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా పూర్తయ్యేలా తమ పార్టీ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని ఎన్నికల సంఘానికి హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ బృందం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా డూప్లికేట్ ఓటర్ల అంశంపై తమ పార్టీ అధ్యయనం నిర్వహించిందని, కొన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో డూప్లికేట్ ఓటర్లు గుర్తించగా, ఒక జిల్లాలో అత్యల్పంగా 464 డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ వివరాలన్నింటినీ ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో సమర్పించినట్లు వెల్లడించారు. డూప్లికేట్ ఓటర్ల సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, భవిష్యత్తులో ఏ పార్టీ అయినా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున ఓటరు జాబితాలను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సోమా భరత్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి భారత పౌరుడికి ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకోవడం, డూప్లికేట్ నమోదులను తొలగించడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు బీఆర్ఎస్ అన్ని విధాలుగా ఎన్నికల సంఘానికి సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు

## ఏన్కూరు వద్ద ఎమ్మెల్యే పూజలు



**ఏన్కూరు, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు సమీపంలోని సాగర్ కాలువలోకి గోదావరి జలాలు ప్రవేశించిన దగ్గర శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పూజలు చేశారు .గోదావరి జలాలను రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్కు అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన ఆదేశాలతో అశ్వాపురం మండలం బిజి కొత్తూరు దగ్గర ఎస్ ఆర్ పి ప్రాజెక్ట్ ప్రధాన పంపు హౌస్ లో మోటార్లను ఆన్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ములకలపల్లి మండలం పూసగూడెం, కమలాపురం వద్ద పంప్ హౌస్ లో మోటార్లను ఆన్ చేసి గోదావరి జలాలను విడుదల చేశారు .శుక్రవారం ఉదయం గోదావరి జలాలు ఏన్కూరు సమీపంలోని సాగర్ కాలువలోకి ప్రవేశించాయి. ఇక్కడ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పూజలు చేశారు .ఎస్కేపు లాకుల ద్వారా వైరా రిజర్వాయర్కు గోదావరి జలాలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి జలాలు వైరా ఆయకట్టుతో పాటు తల్లాడ, కల్లూరు, వేంసూరు, పెనుబల్లి,మధిర, ఎర్రుపాలెం మండలాలలోని సుమారు లక్షా ముప్పై వేల ఎకరాలకు ఊపిరి పోయనున్నాయని అన్నారు. వర్షాలు లేక పంటలకు సాగునీరు అందని ఈ పరిస్థితులలో గోదావరి జలాల రాక అన్నదాతల్లో ఆనందం నింపాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, ప్రముఖ కాంట్రాక్టర్ మొగలి శ్రీనివాసరెడ్డి, లచ్చిరాం నాయక్, స్వర్ణ నరేందర్, లాలు నాయక్ ,ప్రభావతి రెడ్డి, మేడ ధర్మారావు, బానోతు రామారావు, మాదినేని అశోక్, రేగళ్ల నాగయ్య, శోభన్,నాయక్ ,ఎన్ ఎస్పీ అధికారులు పాల్గొన్నారు.

# కళాశాల బాలుర వసతి గృహం ప్రారంభం



**ఏన్కూరు, జులై 10 పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఉన్న గిరిజన బాలుర వసతి గృహాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి ప్రత్యేక చొరవ చూపించి ఈ వసతి గృహం మంజూరు చేయించారని అన్నారు. హాస్టల్ ఏర్పాట్లకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సిఎల్ఆర్ సి భవనాన్ని వసతి గృహంగా అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ హాస్టల్‌లో 40 మంది విద్యార్థులకు సౌకర్యా లు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సింహాచలా న్నీ అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి. కృష్ణప్రసాద్, సుందర్, రామారావు, బాబులాల్, రాజన్న, సాంబశి వరావు, లక్ష్మీనరసింహారావు, వెంకటేశ్వరరావు, కిషోర్, నవీన్, విజయలక్ష్మి, రమాదేవి, కవిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గీసుగొండ పిఎసిఎస్‌లో గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

## డిసిసిబి సీఈఓ వజీర్ సుల్తాన్‌ను కోరిన పిఎసిఎస్ అధ్యక్షుడు రడం శ్రీధర్



**గీసుకొండ, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** గీసుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ పరిధిలోని రైతులు, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు స్థానిక ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు గీసుగొండ పిఎసిఎస్‌లో గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పిఎసిఎస్ అధ్యక్షుడు రడం శ్రీధర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డిసిసిబి, సీఈఓ వజీర్ సుల్తాన్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీసుగొండ ప్రాంత ప్రజలు గోల్డ్ లోన్ సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, ప్రయాణ వ్యయం పెరుగుతోందని వివరించారు. గీసుగొండ పిఎసిఎస్ లోనే గోల్డ్ లోన్ కౌంటర్ ఏర్పాటు చేస్తే రైతులు, మహిళలు, వ్యాపారులు స్థానిక ప్రజలకు త్వరితగతిన, సులభంగా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినతి పత్రాన్ని స్వీకరించిన డిసిసిబి సీఈఓ వజీర్ సుల్తాన్ వినతిని సానుకూలంగా పరిశీలించి, త్వరలోనే గీసుగొండ పిఎసిఎస్‌లో గోల్డ్‌లోన్ కౌంటర్ సదుపాయాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఏజీఎం స్రవంతి పాల్గొన్నారు. గీసుగొం డ పిఎసిఎస్‌లో గోల్డ్‌లోన్ కౌంటర్ ఏర్పాటు ద్వారా గ్రామీ ణ రైతులు, మహిళలు, వ్యాపారులు స్థానిక ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువలో అందుబాటులోకి రావడంతో పాటు, వారి సమయం, ప్రయాణ వ్యయం ఆదా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు

# ఆదివాసీ ఉద్యమ నేత చందా లింగయ్య దొరకు ఘనంగా సత్కారం



**కరకగూడెం, జూలై 10(పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకుడు చందా లింగయ్య దొరకు అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ (ఖూఖ) డాక్టరేట్‌ను అందించిన తరుణంలో ఆయన నివాస గ్రామం కరకగూడెం మండలం చిరుమళ్ళ గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచులు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా మరియు మండల కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందా లింగయ్య దొర గిరిజన, ఆదివాసీ, బహుజన వర్గాల హక్కుల కోసం అనేక దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడుతూ ప్రజా జీవితంలో విశిష్ట గుర్తింపు పొందారు. ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యా అవకాశాల విస్తరణ, సామాజిక న్యాయం కోసం కృషి చేశారు. ప్రస్తుతం కూడా రాజ్యాంగ పరిరక్షణ, గిరిజన భూ–హక్కులు, సాంస్కృతిక హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఉద్యమిస్తున్నారు. చందా లింగయ్య దొరకి డాక్టరేట్ రావడం ఆయన ఒక్కరికే కాకుండా యావత్ గ్రామం, మండలం, జిల్లా కే వన్నె తీసుకొచ్చారని కొని ఆడారు. ఆయన సేవలు ఎన్నటికీ మండల ప్రజలు మర్చిపోరని వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందు ప్రజా క్షేత్రంలో సేవలు అందిస్తామని వారు తెలిపారు.. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి యర్ర సురేష్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ నాగ బండి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, ఆదివాసి నాయకులు గోగ్గలి రవి, సీనియర్ నాయకులు జలగం కృష్ణ, భూక్యా రాం దాస్, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా ఇల్లందులో ధర్నా, మానవహారం




**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 10 (పీపుల్స్ డైరీ) :** అంగన్వాడి టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా ఇల్లందు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా, మానవహారం నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్ సక్కుబాయికి వినతిపత్రం సమర్పించారు. కల్లేపల్లి మరియ అధ్యక్షతన జరిగిన సభలో యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ పాయం సారమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీ) సిఫార్సుల మేరకు అంగన్వాడి టీచర్లకు రూ.41 వేల, హెల్పర్లకు రూ.35 వేల వేతనం నిర్ణయించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతో పాటు పదవీ విరమణ చేసిన వారికి నెలకు రూ.18 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. 2020 జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి, ప్రీ-ప్రైమరీ, పీఎం-శ్రీ విద్యను అంగన్వాడీల ద్వారానే అమలు చేయాలని, గ్రాట్యుటీ చట్టంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్, బీఎల్ఓ, ఎస్ఐఆర్ విధులను రద్దు చేసి, ఖాళీ పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచి వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కనీస్ ఫాతిమా, బత్తుల దేవేంద్ర, తాళ్లూరి కృష్ణ, ఆలేటి సంధ్య, పి. వెంకటమ్మ, సుభద్ర, నాగమణి, సరస్వతి, సుజాత, మిరియ, కె. మంజుల, పి. విజయ, ఎ. రాధ, శారద, నీలిమ, పద్మతో పాటు పలువురు అంగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com

# విద్యాసంస్థల బంద్ విజయవంతం



**మహబూబాబాద్, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మహబూబాబాద్ జిల్లాలో విజయవంతమైందని పిడిఎస్యు జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు నందీశ్వర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలను బైకాట్ చేసి నెహ్రూ సెంటర్లో నిరసన కార్యక్రమం చేశారు అనంతరం విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగువేలకు కుదించాలనే ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలలో విద్యా

## పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు

వ్యాపారం అరికట్టి ఫీజులను నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డిఇఓ మరియు లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న 10500 కోట్ల స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేసి, జీవో నెంబర్ 7,8,9లను రద్దు చేయాలని, ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకంని అమలు చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర, ఇస్కాన్ ,మన్నా సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, విద్య హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేసి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలలో 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలని, గురుకులాలలో అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు పై సమస్యలు ఇప్పటికైనా ప్రభుత్వం పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఉద్యమాలకు పూనుకొని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభించే విధంగా విద్యార్థి లోకంతో ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు సుస్మంత్ షబ్బీర్ దిలీప్ సంజయ్ పార్థు సంపత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వెంకటేష్, వికాస్ గణేష్ , సాయి, విష్ణు, అశోక్, ఎస్ఎఫ్ఐ వంశీ చందు నవీన్ దేవేందర్ నాయకులు పాల్గొన్నారు.




## ఏన్కూరులో పాఠశాలల బంద్ విజయవంతం

**ఏన్కూరు, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ వైరా నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల బంద్ ఏన్కూర్లో విజయవంతం అయింది. విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పాఠశాలలను కుదించే ప్రతిపాదనను విరమించుకోవాలని, పెండింగ్స్ స్కాలర్ షిప్స్,ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ ,లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని తదితర డిమాండ్లతో పాఠశాలల బంద్ నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల రాస్తారోకో




**మట్టెవాడ, జూలై 10 (పీపుల్స్ డైరీ):** విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గవిచర్ల క్రాస్‌రోడ్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాధల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, పిడిఎస్.యూ జిల్లా సహాయ కార్యదర్శి దండు వినయ్, ఏఐఎస్.బి జిల్లా నాయకుడు తాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి వెంటనే పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, 27వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకుని ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించే సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వరప్రసాద్, కార్తీక్, కౌశల్, ఏఐఎస్.బి జిల్లా నాయకులు షారుక్, వసీం, సలీం, ప్రశాంత్, ప్రవీణ్, మహేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను మానుకోవాలి

**కేసముద్రం, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ కేసముద్రంలో విజయవంతమైందని పిడిఎస్యు మండల కార్యదర్శి సూర్య సంపత్ ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ చొప్పరి శరత్ అన్నారు. పట్టణం లోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలను బైకాట్ చేసి మాట్లాడు తూ... రాష్ట్రంలో 27, ప్రభుత్వ పాఠశాలలను నాలుగువేల కుదించాలని ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని ప్రైవేటు కార్పొరేట్ విద్యా వ్యాపారం అరికట్టి ఫీజులను నియంత్రణ చట్టం తీసుకురావాలని ఖాళీగా ఉన్న టీచర్ ఎంఈఓ డిఓ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసి జీవో నెంబర్ 7 8 9 లను రద్దు చేయాలని ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకం ని అమలు చేయాలని అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్స్ మరియు గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయా లని మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర ఇస్కాన్ మున్నా సంస్థలు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలని రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని విద్య హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలలో 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలని గురుకులాల లో అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వినయ్ ఆకాష్ చరణ్ సిద్దేశ్వర్ మరియు కళాశాల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కలల సాకారం

**మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి**



**కేసముద్రం, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, వాటి నిర్మాణంతో పేదింటి కలలు సాకారం అవుతున్నాయని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ఆరెపు కలమ్మ, యాకయ్య దంపతులచే నిర్మించబడిన ఇందిరమ్మ గృహ ప్రవేశంలో మార్కెట్ చైర్మన్, గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రయ్య, ఉప సర్పంచ్ పెదగాని రవి, జిల్లా రవాణా సంస్థ సభ్యులు రావుల మురళి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెపు కలమ్మ, యాకయ్య దంపతులను మార్కెట్ చైర్మన్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, నిర్మాణంలో సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఆరెపు కలమ్మ, యాకయ్య దంపతులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గంట రామ్మోహన్ రెడ్డి, గంట బాలకృష్ణ రెడ్డి, గండి శ్రీదేవి శ్రీనివాస్, జల్లే లచ్చయ్య, కాంగ్రెస్ మండల యూత్ నాయకుడు భూక్య రాంచంద్రు నాయక్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**చిట్యాల, జూలై 10(పీపుల్స్ డైరీ) :** మండలంలోని చల్లగరిగ గ్రామంలో రూ. 10 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని రోడ్లను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం ఎమ్మెల్యే సత్యనారాయణ రావు చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని చల్లగారిగలో సిసి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయని ముఖ్యంగా విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో చల్లగరిగ గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లో



రూ.10 కోట్లతో ముందుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి మరిన్ని నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సుమారు 1500 మంది విద్యార్థులు ఈ స్కూలులో విద్యను అభ్యసించేందుకు ఏర్పాటు చేయడం జరుగుతుందని స్కూల్లో ప్రైమరీ విద్య నుండి 12వ తరగతి వరకు విద్యాభ్యాసం ఉంటుందన్నారు. చల్లగరిగలో సిసి రోడ్లు నిర్మించి బస్టాండ్ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు గ్రామంలోని రామాలయం అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ నుండి 10 లక్షలు మంజూరు చేయడం జరిగిందని టూరిజం శాఖ నుండి మరో కోటి రూపాయలు మంజూ రు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి తిరుపతిరెడ్డి కట్కూరి నరేందర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ నల్ల రాజిరెడ్డి ఆకుల సుధాకర్ దూదిపాల బుచ్చిరెడ్డి మెరుగు సంపత్ కుమార్ ఎంపీడీవో జయశ్రీ తాసిల్దార్ వసంతారావు స్థానిక వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి మహేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు, నాటు సారా నియంత్రించాలి



**నూగురు వెంకటాపురం, జూలై 10(పీపుల్స్ డైరీ) :** మండలంలో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు దుకాణాలు, నాటుసారా విక్రయాలను నియంత్రించాలని, అమ్మకదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావుకు శుక్రవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ( ఐద్వా ) బృందం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకురాలు సాధన పెల్లి దేవి మాట్లాడుతూ.. గ్రామాలలో నాటు సారా, బెల్ట్ షాపుల వలన అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, సారాకు బానిసైన వారు మహిళలపై దాడులకు ఆకృత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద కుటుంబాలు సారావలన రోడ్డు పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులు గుడి, బడి తేడా లేకుండా ప్రతి సందులో బెల్ట్ షాపు అవతరించిందని, మహిళలు, విద్యార్థినిలు రోడ్లపై నడవడానికి భయపడే పరిస్థితులు నెలకొని ఉన్నాయని అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సార అమ్మకాలు, బెల్ట్ షాపుల వ్యవహారంపై మహిళలను చైతన్యవంతులు చేస్తామని ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో సారా రహిత మండలంగా కీర్తి దిద్దే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. మజ్జ సుహాసిని, సినిగిరి సత్యవతి, మడకం పుష్ప, మడకం తిరుపతమ్మ, మడకం దేవి, సమ్మక్క, శ్యామల కేత, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**పెద్దపల్లి, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా పెద్దపల్లిలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌ని తన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే రామగుండంలో సర్వే చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన, అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన, ఉన్నత చదువులు, వృత్తివిద్య కోర్సులు,ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు, ఆన్లైన్ ఆర్డర్స్





,ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి , రాపిడో ,ఓలా , ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లో పనిచేసేటువంటి వ్యక్తుల విషయాలను నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ జడల సురేందర్ , మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ పబ్బతినేని యశ్వంతరావు, మున్సిపల్ బిల్ కలెక్టర్ సమ్మయ్య, మున్సిపల్ మెప్మాసెక్షన్ ఆర్ పి.అజ్మత్, మున్సిపల్ సిబ్బంది వెంకట్ తదితరులు పాల్గొన్నారు

## సంక్షేమ పథకాలలో గంగపుత్రులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలి

**సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ చిన్న రెడ్డికి వినతి పత్రం**

**అందజేసిన టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



**హైదరాబాద్, జూలై 10 (పీపుల్స్ డైరీ) :** గంగపుత్రులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి రాజకీయ ప్రాధ్యాత కల్పించి సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ చిన్న రెడ్డికి టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ బేగంపేట్‌లో గల మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ సీఎం ప్రజావాణి ఇంచార్జ్ రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నా రెడ్డిని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులను ఉద్యమకారులుగా గుర్తింపుతో పాటు రాష్ట ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని డాక్టర్ చిన్న రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ తెలంగాణ రాష్టంలో సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులు కేవలం చేపల వేట చేపలం అమ్మకమే కుల వృత్తిగా జీవనం సాగిస్తూ నిరు పేదరికంలో ఉన్నారన్నారు కావున గంగపుత్ర కులాన్ని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తిస్తూ ప్రభుత్వ నియమిత పదవుల లో సంక్షేమ పథకాలలో గంగపుత్రులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని విన్నవించినట్లు తెలిపారు.